

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

బంగ్లాలో మార్మోగిన భారత్ వ్యతిరేక నినాదాలు 3

రాబోయే ప్రధాని ఇక తమినాడు నుంచే: ఉపరాష్ట్రపతి 5

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-11-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 272 పేజీలు: 8+4 వెల: 8.00



విపక్షం కాదు.. అడ్డంకుల పక్షం

ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ ఫైర్

గుజరాత్ ఏక్తానగర్ పెరేడ్ గ్రౌండ్స్ సభలో ప్రధాని

5



భారత్ ఎయిర్ చీఫ్ మార్షల్‌గా అశుతోష్ దీక్షిత్

5



మోడీ వాయాంలోనే పటేల్ సేవలకు గుర్తింపు

సర్దార్‌పటేల్‌ను పక్కనపెట్టిన కాంగ్రెస్!

గుజరాత్‌లో హోంమంత్రి అమిత్‌షా

ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తెలంగాణ



మినీ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

చిప్ డిజైన్, సెమికండక్టర్, విడిభాగాల ఉత్పత్తికి ప్రాధాన్యం

హార్డ్‌వేర్ పార్కులు బలోపేతం

మినీ మాన్యు ఫాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్,అక్టోబరు31,ప్రభాతవార్త: తెలంగాణను దేశంలోనే ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మలుచుకునేలా టెక్నాలజీ, ఇన్నోవేషన్, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలను అనుసంధానిస్తూ కాంప్రహెన్సివ్ ఇండస్ట్రియల్ ఎకో సిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ఈసిటీలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఆవిష్కరణ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మివి (ఎంఐవిఐ) నూతన మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో తయారీ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. 2025-26లో రాష్ట్ర తయారీ రంగం 7.7 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందన్నారు. రాష్ట్ర పారిశ్రామిక స్థూల విలువ జోడింపు(జీఎస్ వీఏ)లో తయారీ రంగం వాటా రూ.1.37 లక్షల కోట్లకు చేరిందన్నారు. తెలంగాణ రైజింగ్-2047 >>2



న్యూఢిల్లీలో శనివారం జరిగిన మాక్‌పార్లమెంట్‌లో ఇండియా కూటమి నేతలు ఖర్గే, సోనియా, రాహుల్, సిఎం రేవంత్



జ్ఞానేశ్‌ను తప్పించేదాకా

పోరాటం ఆగదు

-రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, అక్టోబరు 31: కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) >>2

సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై ప్రజాభిశంసన

మాక్ పార్లమెంటు సమావేశంలో ఇండికూటమి తీర్మానం

దేశంలో ప్రమాదంలో పడిన సామాన్యుడి ఓటు

2023 ఇసిల నియామక చట్టం రద్దు చేయాలి: ఖర్గే

న్యూఢిల్లీ, అక్టోబరు 31: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల కమిషన్‌ను నడుపుతున్నారని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. దీనివల్ల దేశంలో సామాన్యుడి ఓటు హక్కు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేయాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను నిలిపివేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. శనివారం దిల్లీలోని ఖర్గే అధికారిక నివాసంలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన ప్రతిపక్ష ఇండీ కూటమి మాక్ పార్లమెంట్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు >>2

నేడు ఇండి కూటమి

భారీ ర్యాలీ

న్యూఢిల్లీ,అక్టోబరు 31: సిద్ధాంతాలతో సంబంధం లేకుండా ఇండియా కూటమి మొత్తం సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం ఆదివారం ఏకం అవుతోంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఢిల్లీ రామ్ లీలా మైదానానికి 10 లక్షల మందిని తరలించాలని ఇండియా బ్లాక్ కంకణం కట్టుకుంది. జంతర్ మంతర్ 2.0 >>2



అమిత్‌షా రేపు రాక

హైదరాబాద్‌లో బిజెపి మహాపాదయాత్ర

హైదరాబాద్,అక్టోబరు31,ప్రభాత వార్త: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలంగాణలో నవంబర్ 2వ తేదీన పర్యటించనున్నారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు అమిత్ షా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. 2వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి ఆయన చేరుకోనున్నారు. బేగంపేట నుంచి కాకతీయ హోటల్‌కు వెళ్లనున్నారు. 4గంటల వరకు కాకతీయ హోటల్‌లో కేంద్ర హోం మంత్రి బసచేయనున్నారు. 4గంటలకు బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు నిర్వహించనున్న ర్యాలీలో >>2

కోర్ అర్బన్ ప్రాంతంలో నేటి నుంచి గ్రీన్ ట్యాంకర్లు

అర్బన్ ప్రాంతానికి మంచినీటి సరఫరాపై సిఎస్ సంజయ్ జాజు సమీక్ష



హైదరాబాద్,అక్టోబరు31,ప్రభాతవార్త: కోర్‌అర్బన్ ప్రాంతానికి సంబంధించి తాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం సచివాలయంలో సమీక నిర్వహించారు. కోర్ అర్బన్ ప్రాంతంలో గ్రీన్ ట్యాంకర్ల కార్యక్రమాన్ని ఆదివారం (నవంబర్ 1) నుంచి ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు, వాటి సుస్థిర నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. నిర్మాణ పనులు, ల్యాండ్‌స్కేపింగ్, శుభ్రత పనులు, ఇతర తాగునీటితో సంబంధం లేని అవసరాల కోసం అన్ని ప్రభుత్వ శాఖలు శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని ఆయన ఆదేశించారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టిపిలు) ద్వారా సరఫరా చేస్తున్న శుద్ధి చేసిన నీటి నాణ్యతను నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. శుద్ధి చేసిన నీటిని ఎంత పరిమాణంలో రవాణా చేసి సరఫరా చేస్తున్నారో రోజువారీ వివరాలను సమర్పించాలని హెచ్‌ఎండబ్ల్యుఎస్‌ఎస్‌బి మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ తాగునీటి అవసరాల కోసం రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. మిషన్ భగీరథ కింద అదనంగా 40 ఎంజిడి నీటిని సరఫరా చేసే పథకాన్ని నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అలాగే, జిహెచ్‌ఎంసి, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లలో విలీనమైన అన్ని పట్టణ స్థానిక సంస్థలకు వచ్చే ఏడాది ఆగస్టు వరకు మిషన్ భగీరథ ద్వారా బల్క్ వాటర్ సరఫరా కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం అమలులో ఉన్న తాగునీటి ట్యాంకర్ల సేవల తరహాలోనే, డిమాండ్ మేరకు గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని కూడా వాటర్ బోర్డు సరఫరా చేయనుందని, వినియోగదారులు సులభంగా ఈ సేవలను పొందేందుకు ప్రత్యేక అప్లికేషన్ ద్వారా >>2

టెన్త్ విద్యార్థినిపై రంపంతో దాడి

అనంతపురం జిల్లా రాప్తాడు పాఠశాలలో ఘోరం

3



అండాలతో అక్రమ వ్యాపారం!

మహిళలే లక్ష్యంగా హైదరాబాద్‌లో అంతర్రాష్ట్ర ముఠా వల

రూ.20-30 వేల ఆశ చూపి నియామకం

4 ప్రాంతాల్లో ఒకేసారి దాడులు..

43 మందికి విముక్తి

పలువురు అనుమానితుల అరెస్టు



హైదరాబాద్‌లో శనివారం బాధితులను తరలిస్తున్న పోలీసులు

నేరేడ్ మెట్ / మల్కాజిగిరి కమిషనరేట్/ హైదరాబాద్, అక్టోబరు 31,ప్రభాతవార్త: వైద్య విజ్ఞానం మానవాళికి వరంగా మారాల్సిన చోట.. కొందరి అక్రమ సంపాదనకు సాధనంగా మారిందా? సంతాన సాఫల్య చికిత్సల మాటున మహిళల అండాలను వ్యాపార వస్తువులుగా మార్చే ప్రయత్నం జరిగిందా? అండదానం పేరుతో మహిళలను ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు రప్పించి, వారికి డబ్బు ఆశ చూపించి, వైద్య ప్రక్రియల >>2

సిఇసి జ్ఞానేశ్‌పై ప్రజాభిశంసన

>> వ్యతిరేకంగా కాంగ్రెస్ బహిరంగ ప్రజా అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టింది. అనంతరం ఖర్గే మాట్లాడుతూ, సీఈసీ కుమార్‌పై ఆరోపణలను సభలో చదివి వినిపించారు. జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహానికి పాల్పడ్డారని ఖర్గే ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేసి ఆయనను ఆ పదవిలో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సీఈసీని తొలగించాలని కోరుతూ ప్రతిపక్ష ఎంపీలు ఇప్పటికే పార్లమెంటు ఉభయ సభలలో ప్రతిపాదనలు ప్రవేశపెట్టారని, కానీ తమ నోటీసులను స్వీకరించలేదని ఖర్గే చెప్పారు. అందువల్లే ఈ సమావేశం నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.రాజ్యాంగ సంస్థ గౌరవాన్ని కాపాడటానికే ఈరోజు ఈ ప్రతిపాదనను తీసుకువచ్చాం. సీఈసీపై మాకు ఎలాంటి వ్యక్తిగత విద్వేషం లేదు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయాలని మేం కోరుకుంటున్నామని అన్నారు. సిఇసిపై ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఇండియాకూటమి మాక్ పార్లమెంటులో ఆమోదించింది. 2014 నుంచి అధికారంలో కొనసాగేందుకు మోడీ ప్రభుత్వం అన్ని కుట్రలు చేస్తోంది. 2023 చట్టం కల్పిస్తున్న రక్షణ కారణంగానే సీఈసీ ఓటు చోరీకి పాల్పడుతున్నారు. సర్ ప్రక్రియ ద్వారా దేశంలో ఉద్దేశపూర్వకంగానే 14 కోట్ల మంది ఓట్లను తొలగించారు. ఈ చట్టం ఆయనకు అన్ని విధాల చర్యల నుంచి రక్షణ కల్పిస్తోంది. 145 మంది ప్రతిపక్ష ఎంపీలను పార్లమెంటు నుంచి సస్పెండ్ చేసి, వారిని సభా కార్యకలాపాలలో పాల్గొనకుండా నిరోధించిన తర్వాత ఈ చట్టాన్ని ఆమోదించారు. అందుకే దీన్ని వెంటనే రద్దు చేయాలి. సర్ ప్రక్రియను నిలిపివేసి అక్రమంగా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి. దేశంలో ఎన్నికలు ఏవైనా సరే వాటిని బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలి. ఇవే ఇండీ కూటమి ప్రధాన డిమాండ్లు అని ఖర్గే అన్నారు. లోక్‌సభను పోలి ఉన్నట్లుగా ఈ మాక్ పార్లమెంట్ వేదికను ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ఇండీ కూటమి నేతలు, ప్రతిపక్ష ఎంపీలు హాజరయ్యారు.

జ్ఞానేశ్‌ను తప్పించేదాకా పోరాటం ఆగదు

>> జ్ఞానేశ్ కుమార్‌పై ఇండి కూటమి నేతలు ప్రజా అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తప్పించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థపై దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ‘సర్’లో జరిగిన అవకతవకల వెనుక జ్ఞానేశ్ కుమార్ ఒక్కరే కాదని, ఇంకా చాలామంది ఉన్నారని ఆరోపించారు.‘రాజ్యాంగాన్ని, ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు పోరాడుతాం. సీఈసీపై అభిశంసనతో పాటు దేశద్రోహం కేసు కూడా పెట్టాలి. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా అగ్రస్థానంలో ఉన్నప్పటికీ వారి ఆదేశాలను అమలు చేస్తున్న వారే మా తొలి లక్ష్యం. పదవులు, సంస్థల రక్షణ వెనుక దాక్కుని ఎవరూ తప్పించుకోలేరని రాహుల్ పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం, సీబీఐ, ఈడీ వంటి సంస్థల దుర్వినియోగాన్ని సహించేది లేదు.వీటిపై ప్రజాస్వామ్య శక్తులపోరాటం కొనసాగుతుంది. అలాగే జ్ఞానేశ్ కుమార్‌పై ఉన్న అన్ని అభియోగాలకూ మా వద్ద తగిన ఆధారాలు ఉన్నాయి. ఆయన సీఈసీగా కొనసాగలేరు. అయినప్పటికీ బీజేపీ జ్ఞానేశ్‌ను పదవిలో కొనసాగిస్తే ఆ పార్టీ ఉద్దేశం ఏమిటో అందరికీ స్పష్టమవుతుంది అని లోక్‌సభ ప్రతిపక్ష నేత వెల్లడించారు. అనంతరం రాహుల్ మాక్ పార్లమెంట్ కార్యక్రమం గురించి వివరిస్తూ ఈ కార్యక్రమం కేవలం ఎంపీలు, సామాన్య పౌరుల సమావేశం కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే రాజకీయ ఆయుధమిదని అన్నారు. దేశవ్యాప్తంగా 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారు. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం ఓటర్లలో 15 శాతం మందికి ఓటు హక్కు లేకుండా చేశారు. ప్రతి ఏడుగురు భారతీయుల్లో ఒకరు ఓటు హక్కు కోల్పోయారు. ఓటర్ల హక్కులను హరించిన ప్రతి ఒక్కరూ ఏదో ఒక రోజు ప్రజాప్రతినిధులకు సమాధానం చెప్పుకోవాల్సిందే అని రాహుల్ గాంధీ తెలిపారు.

ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తెలంగాణ

>> విజన్‌లో భాగంగా ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లు, హార్డ్ వేర్ పార్కులను మరింత బలోపేతం చేసేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. చిప్ డిజైన్, సెమికండక్టర్ తయారీ, ఎలక్ట్రానిక్ విడిభాగాల ఉత్పత్తిలోనూ తెలంగాణను ముందంజలో నిలపాలన్నదే తమ లక్ష్యమన్నారు. రీసెర్చ్, ప్రొడక్ట్ డిజైన్ నుంచి విడి భాగాలు, ఎండ్ ప్రొడక్ట్స్ తయారీ వరకు అన్ని కార్యకలాపాలు రాష్ట్రంలోనే జరిగేలా కంపెనీలను ప్రోత్సహిస్తున్నామన్నారు. స్థానిక పరిశ్రమలను గ్లోబల్ సప్లైచైన్‌తో అనుసంధానించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మివి సంస్థ ఇయర్‌బడ్స్, హెడ్‌ఫోన్స్, స్పీకర్లు, సౌండ్‌బార్లు తదితర ఆడియో ఉత్పత్తులను తయారు చేస్తోందని వివరించారు. తాజాగా మివి వన్ 5జీ స్మార్ట్ ఫోన్‌తో మొబైల్ తయారీ రంగంలోకి కూడా అడుగు పెట్టిందన్నారు. కార్యక్రమంలో టీజీఐఐసీ ఎండీ శాంక, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మివి ప్రతినిధులు విశ్వనాథ్ కందుల, మిధుల దేవభక్తుని తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రేపు రాక

>> అమిత్ షా పాల్గొననున్నారు. 5 గంటల నుంచి 5:30 వరకు ఎంజే మార్కెట్ వద్ద జరిగే కార్నర్ మీటింగ్‌కు అమిత్ షా హాజరుకానున్నారు. అనతరం 6గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4గంటల వరకు ఉన్న రిజర్వ్ షెడ్యూల్‌లో రాష్ట్రంలోని ప్రముఖులను కేంద్ర హోం మంత్రి కలిసే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ ముఖ్య నేతలతో కూడా అమిత్ షా భేటీ అయ్యే అవకాశం ఉంది. కాగా, నవంబర్ 2న హైదరాబాద్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొననున్న బీజేపీ మహా పాదయాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

ఈ మహా పాదయాత్ర నిర్వహణకు సంబంధించి శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కర్ణాటక రాష్ట్ర సహ ఇన్‌ఛార్జ్ డా. కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు శాంతికుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహా పాదయాత్ర విజయవంతానికి చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లు, నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యం, ప్రజల భాగస్వామ్యం, కార్యక్రమ నిర్వహణ, సమన్వయం తదితర కీలక అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

నేడు ఇండి కూటమి

భారీ ర్యాలీ

>> విషయంలో ఫెయిల్ అయిన కాక్రోచ్ జనతా పార్టీ కూడా ప్రతిపక్షాల నిరసనకు మద్దతు ప్రకటించింది. దీంతో ఇప్పుడు అందరి చూపులు నవంబర్ 1 వైపుకే మళ్లాయి ఇంతకీ ఆ రోజు ఢిల్లీలో ఏం జరగబోతోంది. ఢిల్లీలోని రాంలీలా మైదానం నవంబర్ 1న జరగనున్న విపక్షాల మహా ర్యాలీకి సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరగనుంది. ఇండియన్ ఎక్స్ ప్రెస్ కథనం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్న విపక్ష కూటమి ఈసారి భారీ బల ప్రదర్శనకు సిద్ధమైంది. ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న అన్ని పార్టీలు తమ అనుబంధ విద్యార్థి సంఘాల ద్వారా భారీగా జన సమీకరణ చేస్తున్నాయి. ఈ ర్యాలీలో పది లక్షల మంది దాకా పాల్గొంటారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, నేహాబోరాతో పాటు సీజేపీ కీలక నేతలు ర్యాలీని ముందుండి లీడ్ చేసే అవకాశముంది. జంతర్ మంతర్‌ను డీ నోటిఫై చేసి నిన్న మొన్నటి వరకు ఆందోళనలను కట్టడి చేయగలిగిన ఢిల్లీ పోలీసులకు అన్ని అనుమతులతో జరుగుతున్న రామ్ లీలా మైదాన్ సభకు భద్రతా ఏర్పాట్లు చేయడం మినహా మరో ఆప్షన్ లేదు. లక్షలాది మంది వస్తారని నిర్వాహకులు చెబుతుండటంతో ఢిల్లీ పోలీసులతో పాటు పారామిలటరీ బలగాలను భారీగా మోహరించారు. రాంలీలా మైదానం చుట్టుపక్కల ఎలాంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వేదిక లోపల, బయట దాదాపు 3 వేల మంది ఢిల్లీ పోలీసు సిబ్బందిని మోహరిస్తున్నారు. వీరికి అదనంగా 10 వేల మంది పారామిలటరీ బలగాలను కూడా రంగంలోకి దించారు. మైదానం మొత్తాన్ని పర్యవేక్షించడానికి 150 హైడెఫినిషన్, ఏఐ ఆధారిత సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విధుల్లో ఉన్న భద్రతా సిబ్బందికి బాడీవోర్న్ కెమెరాలు కూడా అందుబాటులో ఉంచారు. దాదాపు 12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ మైదానాన్ని భద్రత కోసం 8 రీజియన్లు, 14 జోన్లుగా విభజించారు. వీవీఐపీలు సీనియర్ అధికారుల వాహనాల రాకపోకల కోసం ప్రత్యేకంగా రెండు గేట్లు కేటాయించారు. రాహుల్ గాంధీ లాంటి అగ్ర నేతలను అత్యవసర పరిస్థితుల్లో సురక్షితంగా తరలించేందుకు కంటింజెన్సీ ప్లాన్ సిద్ధం చేశారు. సాధారణ ఆందోళనకారులు లోపలికి వచ్చేందుకు మూడు గేట్లు ఏర్పాటు చేశారు.

వారం - వర్జ్యం

01-11-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, కృష్ణపక్షం, స్వాతి కార్తె,
తి.సప్తమి మ.2.55,పుష్యమి తె.4.31
వ.మ.1.16-మ.2.47
దు.సా.4.00-సా.4.46
రాహు. సా.4.30-సా.6.00
శుభ ఉ.8.00-ఉ.09.00

వారాఫలం

మేషం : గృహ నిర్మాణము, భూమి మొదలైన వాటిలో అభివృద్ధి కనిపిస్తుంది. మానసిక ధైర్యం అన్నింటికన్నా గొప్పదని గర్తిస్తారు.

వృషభం : దైవం తోడు ఉంటే కాలం కలిసి వస్తుందని సమయం కోసం వేచి ఉంటారు. రాజకీయ యత్నాలు ఫలిస్తాయి.

మిథునం : పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గతంలో వద్దనుకున్న అవకాశాలు తిరిగి అనుకూలం చేసుకుంటారు.

కర్కాటకం : కలిసి వచ్చిన, పొదుపు చేసిన ధనాన్ని పెట్టుబడి రూపంలో చూసుకుంటారు. శుభవార్తలు అందుకుంటారు.

సింహం : ఆర్థిక సంబంధిత విషయముల మీద మీ దృష్టిని కేంద్రీకరిస్తారు. ప్రభుత్వ విధానాలు ఆందోళన కలిగిస్తుంది.

కన్య : ఉద్యోగములో కొందరు స్వార్థపరులు మీపై చేసే దుష్ప్రచారం వలన మానసిక ప్రశాంతతను కోల్పోతారు.

తుల : కుటుంబ సమస్యల నుండి బయట పడతారు. ఇంటి యందు శుభకార్యాలు జరుగుతాయి. ఒక అవకాశం వెతుక్కుంటూ రాగలదు.

వృశ్చికం : ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తిచేస్తారు. జీవిత భాగస్వామితో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

ధనుస్సు : మీ సలహాలు నైపుణ్యము మీకు కాక ఇతరులకు ఉపయోగపడతాయి. క్రయ విక్రయాలలో ప్రోత్సాహము.

మకరం : అనుకూల ఫలితాలు ప్రతికూల ఫలితాలు సరి సమానంగా ఉంటాయి. అమ్మకాల విషయాలలో జాగ్రత్త అవసరం.

కుంభం : మీ పలుకుబడి అన్ని విధాలుగా ఉపయోగించి ఉద్యోగపరమైన ఒత్తిళ్ళను తట్టుకుంటారు. నిదానం అవసరం.

మీనం : సంఘంలో గౌరవ మర్యాదలు పొందుతారు. నూతన అవకాశాలు పొందుతారు. పోటీ పరీక్షలలో పాల్గొంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోరి, హైదరాబాద్

అండాలతో అక్రమ వ్యాపారం!

>> కోసం వినియోగిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అంతర్రాష్ట్ర ముఠా వ్యవహారం ఇప్పుడు సంచలనం రేపుతోంది. మల్కాజిగిరి పోలీసుల సమన్వయంతో జరిగిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఈ వ్యవహారం వెలుగులోకి రావడం వైద్య రంగంలో నియంత్రణ, పర్యవేక్షణ వ్యవస్థలపై కీలక ప్రశ్నలను లేవనెత్తుతోంది. బేగంపేటలోని ప్రకాశ్‌నగర్ మొదలుకొని ఎర్రగడ్డ, సరూర్‌నగర్, గోపాలపురం వరకు నాలుగు ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహించిన దాడుల్లో 43 మంది మహిళలను పోలీసులు రక్షించారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకున్నారు.



శనివారం మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి.చిత్రంలో ఇతర ఉన్నతాధికారులు

అండదానం పేరుతో ఆకర్షణ.. ఆ తర్వాత అసలు వ్యవహారం!

పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైన వివరాలు ఈ ముఠా పనిచేసిన తీరుపై అనేక అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లోని మహిళలను లక్ష్యంగా చేసుకుని ఏజెంట్లు, మధ్యవర్తుల ద్వారా నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఒక్కో అండదాన ప్రక్రియకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లిస్తామని ఆశ చూపించి హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు మహిళలు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. నగరానికి చేరుకున్న తర్వాత అద్దె ఇళ్లలో వసతి కల్పించి, అండాశయాలను ఉత్తేజపరిచే హార్మోన్ ప్రక్రియలు, అండాల సేకరణకు సంబంధించిన వైద్య సేవల కోసం వివిధ కేంద్రాలకు పంపుతున్నట్లు అనుమానిస్తున్నారు. కొంతమందికి హార్మోన్ ఇంజెక్షన్లు, మందులు ఇచ్చినట్లు కూడా ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

నాలుగు ప్రాంతాలు.. ఒకేసారి పోలీసుల ఉచ్చు

ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న మల్కాజిగిరి కమిషనరేట్ ప్రత్యేక కార్యకలాపాల బృందం, కంటోన్మెంట్ జోన్, బేగంపేట, సరూర్‌నగర్ పోలీసులతో సమన్వయం చేసుకుని వ్యూహాత్మకంగా రంగంలోకి దిగింది. ప్రకాశ్‌నగర్, ఎర్రగడ్డ, సరూర్‌నగర్, గోపాలపురం ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టింది. ఈ దాడుల్లో మహిళలకు వసతి కల్పిస్తున్న ప్రాంగణాలు, అనుమానాస్పద కార్యకలాపాలకు సంబంధించిన ఆధారాలను గుర్తించినట్లు సమాచారం. పత్రాలు, సెల్‌ఫోన్లు, వైద్య సామగ్రిని స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. మహిళల స్వస్థలాలు, నియామక పరిస్థితులు, వైద్య చరిత్ర, వారికి ఇచ్చిన మందులు, నిర్వహించిన చికిత్సల వివరాలను అధికారులు ధ్రువీకరిస్తున్నారు.

అద్దె ఇంటి నుంచే రెండేళ్లుగా కార్యకలాపాలా?

ఈ వ్యవహారంలో ప్రధాన నిర్వాహకుడిగా అనుమానిస్తున్న అమిత్ శర్మ పాత్ర కీలకంగా మారింది. బేగంపేటలోని ప్రకాశ్‌నగర్‌లో సుమారు రెండేళ్లుగా అద్దె ప్రాంగణం నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు సమాచారం.

ఇందుకోసం నెలకు రూ.50 వేల అద్దె చెల్లిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. చట్టబద్ధమైన వైద్య నిబంధనలను పాటించకుండా అండాల సేకరణ ప్రక్రియలకు ఏర్పాట్లు చేసి, మహిళల నియామకం నుంచి వైద్య కేంద్రాలకు పంపించే వరకు సమన్వయం చేసినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. నిక్కత్ పర్వీన్ మహిళల నియామకం, ఇతర రాష్ట్రాల నుంచి తరలింపు, వసతి కల్పనలో సహకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

మందులు, ఇంజెక్షన్లు.. వైద్య ప్రక్రియలపై అనుమానాలు

సోదాల్లో హ్యూమాగ్ పెచేపీ 150 ఐ.యూ. మందులు, సిరంజి, సూదులు, ప్రిమోలట్, మెప్రేట్ మాత్రలు సహా పలు వైద్య సంబంధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇవి ఏ ప్రయోజనం కోసం, ఎవరి పర్యవేక్షణలో వినియోగించారనే అంశాన్ని వైద్య నిపుణుల సహకారంతో పరిశీలించాల్సి ఉంది.

కొన్ని ప్రాంగణాల్లో అధీకృత వైద్య పర్యవేక్షణ, వైద్య వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన లోపాలు ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించారు. మహిళలకు నిర్వహించిన హార్మోన్ చికిత్సలు, అండాల సేకరణ ప్రక్రియలు, వైద్యపరమైన ప్రమాదాల గురించి వారికి ముందస్తుగా వివరించారా? వారి సమ్మతి స్వచ్ఛందంగా పొందారా? అనే అంశాలు దర్యాప్తులో అత్యంత కీలకంగా మారాయి.

ముఠాలో ఎవరెవరి పాత్ర?

పోలీసులు విడుదల చేసిన వివరాల ప్రకారం అమిత్ శర్మ, నిక్కత్ పర్వీన్, రేష్మా ఖాతూన్, మెహూవత్ శ్రీనివాస్ అలియాస్ సోను, జెష్ఫే ప్రదీప్, ఎస్.కె. పర్వీన్, విజయ్ భగ్వా రావు సాలుంకే, పంకజ్ సోనీ తదితరుల పాత్రపై విచారణ జరుగుతోంది.

వీరిలో కొందరు మహిళల నియామకం, మరికొందరు వైద్యపరమైన సమన్వయం, పత్రాల నిర్వహణ, మధ్యవర్తిత్వ కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సరూర్‌నగర్ కేసుకు సంబంధించి ఎమిరిశెట్టి దుర్గాప్రసాద్‌ను కూడా అరెస్టు చేసినట్లు అందిన వివరాల్లో పేర్కొన్నారు. అయితే ప్రతి ఒక్కరి పాత్ర, కేసుల వారీగా అరెస్టుల సంఖ్యపై అధికారిక నిర్ధారణ అవసరముంది.

ఐవీఎఫ్ కేంద్రాల పాత్రపైనా దర్యాప్తు

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన అంశం అండాల సేకరణ ప్రక్రియలకు మహిళలను పంపినట్లు అనుమానిస్తున్న సంతాన సాఫల్య కేంద్రాలు, ఏఆర్టీ బ్యాంకుల పాత్ర. మహిళలను ఏ కేంద్రాలకు పంపించారు? అక్కడ ఎవరు వైద్య సేవలు అందించారు? అవసరమైన అనుమతులు, నమోదు పత్రాలు ఉన్నాయా? అండాల సేకరణకు సంబంధించి చట్టం నిర్దేశించిన ప్రమాణాలు పాటించారా? అనే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. వైద్య రికార్డులు, మహిళల సమాచారంతో కూడిన సమ్మతి పత్రాలు, అండాల సేకరణ సంఖ్య, బీమా, వైద్య భద్రతా ప్రమాణాలు పరిశీలనలో ఉన్నాయి. అసలు వైద్య కేంద్రాల ప్రమేయం ఎంతవరకు ఉంది? మధ్యవర్తుల స్థాయిలోనే అక్రమాలు జరిగాయా? లేక మరింత విస్తృతమైన వ్యవస్థ పనిచేసిందా? అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

పర్యవేక్షణలో ప్రత్యేక ఆపరేషన్

మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ చేపట్టారు. డీసీపీలు చి. శ్రీధర్, కె. మనోహర్, ఏసీపీలు పి. గోపాలకృష్ణమూర్తి, రవీందర్ రెడ్డి మార్గదర్శకత్వంలో బేగంపేట ఇన్‌స్పెక్టర్ పి. సైదులు, సరూర్‌నగర్ పోలీసు అధికారులు శ్రీశైలం, శేఖర్, మల్కాజిగిరి జోన్ ఎస్ఓటీ బృందం ఇన్‌స్పెక్టర్ ఎస్. శివలింగం, సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

ఇంకా బయటపడాల్సిన అసలు నెట్‌వర్క్

43 మంది మహిళలను రక్షించడం ఈ ఆపరేషన్‌లో కీలక పరిణామం. అయితే ఈ వ్యవహారంలో నియామక ఏజెంట్లు ఎవరు? ఇతర రాష్ట్రాల్లో ఇంకా ఎంతమందిని లక్ష్యంగా చేసుకున్నారు? అండాల సేకరణకు సంబంధించి ఎన్ని కేంద్రాలు పనిచేశాయి? వైద్యపరమైన నిబంధనలను ఎక్కడెక్కడ ఉల్లంఘించారు? ఈ వ్యవహారంలో ఆర్థికంగా లబ్ధి పొందినవారు ఎవరు? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

పోలీసులు స్వాధీనం చేసుకున్న పత్రాలు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక లావాదేవీల పరిశీలనతో ఈ వ్యవహారం వెనుక ఉన్న పూర్తి వ్యవస్థ వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అప్పుడే ఈ అక్రమ నెట్‌వర్క్ పరిధి, దాని వెనుక ఉన్న అసలు వ్యక్తుల పాత్ర స్పష్టమవుతుంది.


ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని శక్తిస్థల్ వద్ద నివాళులర్పిస్తున్న సోనియా, సిఎం ం రేవంత్

ఢిల్లీలోని శక్తిస్థల్ వద్ద ఇందిరాగాంధీకి

పుష్పాంజలి ఘటించిన సిఎం రేవంత్

హైదరాబాద్,అక్టోబరు31,ప్రభాతవార్త: భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ సమాధి శక్తి స్థల్ వద్ద పుష్పాంజలి ఘటించారు.దేశ సమగ్రత, సార్వభౌమత్వం, ఆర్థికాభివృద్ధి, పేదల సంక్షేమం వంటి అంశాలకు తన పాలనలో ప్రాధాన్యమిస్తూ దేశ అభ్యున్నతికి ఇందిరా గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.

భారతదేశ రాజకీయ చరిత్రలో ధైర్యానికి, దృఢ సంకల్పానికి, నాయకత్వ పటిమకు ప్రతీకగా నిలిచిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ అని, ఎన్నో సవాళ్లు, ఒడిదుడుకులు ఎదురైనా దేశ ప్రయోజనాలే లక్ష్యంగా ఆమె సాగించిన ప్రస్థానం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు.

ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్లకు

ప్రత్యేక నిధులు మంజూరు

సింగూరు తాగునీటి అవసరాలకు రూ.120 కోట్లు

ఇతర జిల్లాలకు రూ.కోటి చొప్పున నిధులు

గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీర్లతో మంత్రి సీతక్క టెలి కాన్ఫరెన్స్

హైదరాబాద్,అక్టోబరు31,ప్రభాతవార్త: ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజూరు చేసిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తెలిపారు. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు, ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం రూ.కోటి చొప్పున ప్రభుత్వం ఆమోదించిందని వెల్లడించారు. ఈ నిధులతో అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను వేగవంతం చేసి, ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో మంత్రి సీతక్క టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక వనరులను వినియోగించుకోవడంతో పాటు, అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు, బావులు తదితర స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మిషన్ భగీరథ సరఫరాలో అంతరాయం ఏర్పడే గ్రామాలు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను గుర్తించి, అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు. ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి సహా పలు ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ విభాగాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల ప్రోరోగ్

హైదరాబాద్,అక్టోబరు31,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర మూడవ అసెంబ్లీ 8వ సెషన్‌కు సంబంధించి స



నేషనల్ సిటిజన్ పార్టీ నిర్వహించిన భారీ ర్యాలీలో భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నిరసనకారులు

బంగ్లాలో మార్మోగిన భారత్ వ్యతిరేక నినాదాలు

ఎన్‌సీపి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు

ఢాకా, అక్టోబరు 31: బంగ్లాదేశ్‌లో మరోసారి భారత్ వ్యతిరేక నినాదాలు మార్మోగాయి. దేశంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ కోతలు, ఇంధనం, గ్యాస్ కొరతపై ప్రధాని తారిఖ్ రెహ్మాన్ నేతృత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తాయి. హోం, ఇంధన శాఖల మంత్రులు రాజీనామా చేయాలని పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనల్లో భాగంగా నేషనల్ సిటిజన్ పార్టీ నిర్వహించిన భారీ ర్యాలీలో భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢాకాలోని నేషనల్ మ్యూజియం ఎదుట శుక్రవారం ఈ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీపీ కన్వీనర్ నహీద్ ఇస్లాం నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొన్నారు. ఢిల్లీ కాదు, ఢాకా అంటూ నేతలు నినాదాలు చేయగా, సభకు హాజరైనవారు ఢాకా ఢాకా అంటూ స్పందించినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమైన వీడియోలు చూపించాయి. 2024లో షేక్ హసీనా ప్రభుత్వాన్ని గద్దె దించిన విద్యార్థుల ఉద్యమం నుంచి ఎన్‌సీపీ ఆవిర్భవించింది. ర్యాలీలో నహీద్ ఇస్లాం భారత్‌పై ఆరోపణలు చేశారు. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా భారత్ కుట్రలు చేస్తోందని, సరిహద్దుల్లో హత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. అసోం, పశ్చిమ బెంగాల్‌లో ముస్లింలపై వేధింపులు జరుగుతున్నా యని, ఢిల్లీలో మసీదులను కూల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలకు ఆధారాలను ఆయన చూపలేదు. గంగా జలాల ఒప్పందాన్ని న్యాయంగా పునరుద్ధరించకపోతే మరోసారి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఎన్‌విఎస్-3 నావిగేషన్ ఉపగ్రహం సక్సెస్‌పై

ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు సిఎం రేవంత్ అభినందనలు

హైదరాబాద్,అక్టోబరు31,ప్రభాతవార్త: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) జిఎస్‌ఎల్‌వి-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌విఎస్-3 నావిగేషన్ ఉప గ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందికి అభినందనలు తెలి పారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టడం భారత నావి గేషన్ సామర్థ్యాలను మరింత బలోపేతంచేసే కీలక మైలురాయి అని ప్రశం సించారు. రవాణా, విమానయానం, సముద్ర నావిగేషన్, పర్యవేక్షణ, అత్య వసర సేవల వంటి కీలకరంగాల్లో ఎన్‌విఎస్-3 మెరుగైన సేవలు అందిం చనుందని పేర్కొన్నారు. ఈ విజయం యావత్ దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షి ంచారు.

ప్రజలకు చేరువలో ముఖ్యమంత్రి

గల్ఫ్ మృతుల కుటంబాలకు అండగా ప్రభుత్వం

పిసిసి అధికార ప్రతినిధి భవానిరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం ప్రజలకు చేరువలో ఉంటూ వారి దైనందిక సమస్యలపై పని చేస్తున్నారనీ గల్ఫ్ లో చనిపోయినవారికీ అండగా ఉంటుంది మా ప్రభు త్వం టిపిసిసి అధికార ప్రతినిధి భవానిరెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ హరీశ్‌రావు ఏ ప్రాజెక్టు దగ్గర బ్లాస్టింగ్ జరిగింది?నోరు తెరిస్తే అబద్దాలు విష ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కవిత నువ్వు ఎం మాట్లాడిన మీ అయ్య, మీ అన్న గురించి మాట్లాడు మా కాంగ్రెస్ గురించి కాదు అని సూచించారు. మా ముఖ్యమంత్రి తుమ్మిడి హట్టి ప్రాజెక్టు గురించి మహారాష్ట్ర ప్రభుత్వం తోనే కాదు ఢిల్లీలో కేంద్ర మంత్రి తో మాట్లాడింది కనబడలేదా అని కవితను ప్రశ్నించారు. మీ నాన్న నిర్ణయాలతో నే కదా రాష్ట్రం ఆగమైందనీ 2016 లోనే ప్రాజెక్టు ఎత్తిపోతల, తిప్పిపోతలా అని అడిగినమనీ గుర్తుచేశారు.కెసిఆర్,బిఆర్ఎస్ కానీ కవితకానీ ఎందుకు సర్ మీద ఎందుకు మాట్లాడుతలేరని నిలదీశారు. తుమ్మిడి హట్టి ప్రాజెక్టు గురించి మీ నాన్నని ప్రశ్నించు ప్రభుత్వ భూములు కాంగ్రెస్ ప్రజా ప్రభు త్వం కాపాడుతుందనీ కరువు పై హరీష్ రావ్ సోయి లేకుండా మాట్లా డుతుండు అని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. సిఎంపై మాట్లాడే నైతికత కెసిఆర్ కుటుంబంలోని ఎవరికి అర్హత లేదని అన్నారు. మీ మాయాంలో ఒక్కసారైనా అఖిలపక్ష మీటింగ్ పెట్టి పిలిచారా అఖిలపక్షం పెట్టి సలహాలు సూచనలు తీసుకుంటుంది మా ప్రభుత్వం అన్నారు. కరోనా టైం లో ప్రజలకు అండగా నిలిచింది కాంగ్రెస్ పార్టీ పారాసేటమాల్ వేసుకొండి అని చెప్పి కెసిఆర్ ప్రజల ప్రాణాలను తీశారని ఆవేదన చెందారు.

పారిశ్రామిక అవసరాల మేరకు సాంకేతిక నైపుణ్యశిక్షణ

శక్తి, గనుల శాఖ మంత్రి

వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త: పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు సాంకేతిక నైపు ణ్య శిక్షణ ఇచ్చి 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలి యన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనకు బాటలు వేస్తామని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ స్వర్ణోత్స వాల సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఆర్థికవృద్ధి, సుస్థిర అభివృద్ధి, ప్రజా విధానాలు అనే అంశంపై జరిగిన చర్చల్లో భాగంగా దేశ, రాష్ట్ర ఆర్థికా భివృద్ధికి అవసరమైన అంశాలను వివరించారు. దేశం స్థిరమైన ఆర్థిక వృద్ధిని సాధించాలంటే అభివృద్ధి అన్ని ప్రాంతాలకు, అన్ని వర్గాలకు చేరాలని మంత్రి అన్నారు. ఆర్థిక వృద్ధి అంటే కేవలం స్థూల దేశీయోత్పత్తి పెరగడం మాత్రమే కాదని, ప్రజలకు మెరుగైన ఆదాయం, యువ తకు ఉపాధి, ప్రభు త్వానికి అధిక ఆదాయం సమకూ రడంతోపాటు సంక్షేమ కార్యక్రమాలకు మరిన్ని నిధులు అందుబాటులోకి రావడమని వివరించారు. ముఖ్యంగా కృత్రిమ మేధ విస్తరణతో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ రంగంలో మార్పులు వస్తున్నాయని, ఈ పరిణామాలకు అను గుణంగా యువత తమ నైపుణ్యాలను ఎప్పటి కప్పుడు మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు. తెలం గాణలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను అభివృద్ధి చేస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామని, ఇందుకోసం దాదాపు రూ.4 వేల కోట్ల పెట్టుబడితో ఆధునిక శిక్షణ సదుపాయాలు కల్పించామని తెలిపారు. రాష్ట్రంలో మరో 54 ఎటిసిలను వచ్చే ఏడాది నాటికి ప్రారంభిస్తామని తెలిపారు. పరిశ్రమలకు ఏ నైపుణ్యాలు అవసరమో వాటిని గుర్తించి, అందుకు అనుగుణంగా శిక్షణ పాఠ్యప్రణాళిక రూపొందించామని తెలిపారు. పరి శ్రమల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి, వారి అవసరాలకు అనుగు ణంగా కోర్సులను రూపొందించడంతో పాటు బోధనా సిబ్బందికి కూడా ఆధునిక సాంకేతికతపై శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో వృద్ధాప్య జనాభా పెరుగుతున్న నేపథ్యంలో నైపుణ్యం కలిగిన కార్మికులకు డిమాండ్ పెరుగుతోందని మంత్రి వివరించారు. ఆయా దేశాలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలతో పాటు స్థానిక భాష, పని సంస్కృతి, క్రమశిక్షణపై యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. విదేశాల్లో పనిచేసే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువత సిద్ధం కావాలని సూచించారు. నిరంతరం చదవడం, కొత్త విషయాలు నేర్చుకోవడం, తమ వృత్తిపరమైన సామ ర్థ్యాలను పెంచుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఐదు దశాబ్దాలుగా మానవ వనరుల అభివృద్ధి, శిక్షణ కార్యక్రమాల ద్వారా సేవలందిస్తున్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థను మంత్రి అభినందించారు.



డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

సోలార్ పవర్ 2,545 మెగావాట్లు కొనుగోలు

విద్యుత్ నియంత్రణ కమిషన్ గ్రీన్‌సిగ్నల్

మూడు కేంద్ర సంస్థల నుండి సేకరణకు డిస్కంలు సిద్ధం

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుండి సోలార్ విద్యుత్ నిమిత్తం 2545 మెగావాట్ల మేర కొనుగోలు చేయడానికి తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఈఆర్‌సి) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత ఆగస్టు నెలలో సోలార్ విద్యుత్ కొను గోలుకు సంబంధించి ఆమోదించాల్సిందిగా రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పించాయి. దీంతో ఈ ప్రతిపాదనలను పరిశీలించిన నియంత్రణ కమిషన్ వాటికి సంబంధించి అనుమతి నిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకి) నుంచి 1000 మెగావాట్లు, ఎన్‌టీపీసీ నుంచి 1045 మెగావాట్లు, ఎన్‌హెచ్‌పీసీ నుంచి 500 మెగావాట్లు చొప్పున విద్యుత్ కొనుగోలుకు అంగీకారం తెలిపింది. ఎన్‌టీపీసీ, ఎన్‌హెచ్‌పీసీల నుంచి యూనిట్ రూ.2.45లకు, పోలార్ ఎనర్జీ కార్పొరేషన్ నుంచి యూనిట్ రూ.2.37ల చొప్పున 700 మెగావాట్లు, రూ.2.38 లకు మరో 300 మెగావాట్లను కొనుగోలు చేయడానికి అనుమతినిస్తూ నిర్ణయించింది. అయితే సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంలో జాప్యం, జీఎస్టీ పెంపు కారణంగా టారిఫ్ ల సవరణ, అంతరాష్ట్ర విద్యుత్ ట్రాన్స్‌మిషన్ చార్జీలు, మధ్యవర్తి సంస్థలకు చెల్లించే ట్రేడింగ్ మార్జిన్ వంటి అంశాలపై నియంత్రణ మండలి పలు కీలక అంశాలను వెల్లడించింది. 2545 మెగావాట్లలో ఇప్పటికే 1745 మెగావాట్లకు సంబంధించిన ప్లాంట్లు సిద్ధం కాగా, మిగిలిన 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. కాగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ అనూహ్యంగా పెరుగుతున్నది. దీన్ని దృష్టిలో ఉంచుకుని సౌర విద్యుత్తు కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని ఉత్తర, దక్షి ణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ కమిషన్‌ను ఆశ్రయించాయి. మొత్తం 2,545 మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలుకు సంబంధించిన టారిఫ్‌ను ఆమోదించాలని పిటిషన్ దాఖలు చేశాయి. విద్యుత్తు చట్టం 2003లోని 63, 86(1) (బి) సెక్షన్లతో పాటు, తెలంగాణ విద్యుత్తు సంసరణల చట్టం1998లోని సెక్షన్ 21(4) ప్రకారం ఈ పిటిషన్ దాఖలు చేశాయి. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద మూడు వేర్వేరు సంస్థల నుంచి సౌర విద్యుత్తు కొనుగోలు చేయాలని డిసమ్‌లు ప్రతిపాదించాయి. మొత్తం 2545 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలుకు ఇప్పటికే ఒప్పందాలు కుదిరినట్టు ఆ పిటిషన్‌లో పేర్కొన్నాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలికంగా తకువ ధరలో నాణ్యమైన విద్యుత్తును అందించడమే ఈ కొనుగోళ్ల ప్రధాన ఉద్దేశమని తెలిపాయి. విద్యుత్ పంపిణీ సంస్థల సమర్పించిన పిటిషన్‌పై నియంత్రణ కమిషన్ విచారణ నిర్వహించిన అనంతరం టారిఫ్ ఆమోదంపై తుది నిర్ణయం తీసుకుంది. దీంతో సోలార్ విద్యుత్ కొనుగోలు ప్రతిపాదనలకు కమిషన్ అనుమతించడంతో పంపిణీ సంస్థలు సంబంధిత సంస్థల వద్ద సేకరించేందుకు సిద్ధమవుతున్నాయి.

క్లాస్‌రూంలో కిరాతకుడు

టెన్త్ విద్యార్థినిపై రంపంతో దాడి

అనంతపురం జిల్లా రాప్తాడు పాఠశాలలో ఘోరం

ప్రేమ నిరాకరించిందనే కక్షతో దాడి .. అడ్డుకొన్న మరో విద్యార్థినికి గాయాలు

మెరుగైన చికిత్స కోసం బెంగళూరు ఆస్పత్రికి తరలింపు

బాధితురాలికి ఉత్తమ వైద్యం అందించాలని ఎపి సిఎం చంద్రబాబు ఆదేశం





దాడికి పాల్పడిన నిందితుడు హేమంత్, అతడు ఉపయోగించిన రంపం

రాప్తాడు, అక్టోబరు 31, ప్రభాతవార్త: అనంతపురం జిల్లా రాప్తాడులోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం దారుణ ఘటన చోటు చేసు కుంది. పదో తరగతి చదువుతున్న గోపిక అనే విద్యార్థినిపై ఓ యువకుడు చెట్ల కొమ్మలు కోసే రం పంతో విచక్షణారహితంగా దాడి చేశాడు. తర గతి గదిలో ఉపాధ్యాయుడు పాఠాలు బోధి స్తుండగానే ఈ ఘటన జరగడం తీవ్ర కలకలం రేపింది. దాడిలో బాలిక ముఖం, తల, చేతులు, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినికి కూడా గాయాలయ్యాయి.

తరగతి గదిలోకి ప్రవేశించి దాడి..

రాప్తాడు మండలం అయ్యవారిపల్లికి చెందిన గోపిక ప్రతిరోజూ తోటి విద్యార్థినులతో కలిసి ఆటో లో పాఠశాలకు వస్తుంది. శనివారం కూడా యథా విధిగా పాఠశాలకు చేరుకుని తరగతి గదిలో పాఠాలు వింటుండగా నిందితుడు వెనుక వైపు నుంచి వచ్చి ఒక్కసారిగా రంపంతో దాడికి పాల్ప డ్డాడు. ఊహించని పరిణామంతో విద్యా ర్థులు భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు భయం తో తరగతి గది నుంచి బయటకు పరుగులు తీశారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది.

పోలీసుల అదుపులో నిందితుడు..

ఈ ఘటనకు పాల్పడిన నిందితుడు హేమంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ధర్మవరం రైల్వే స్టేషన్‌లో అతడిని పట్టుకున్నట్లు తెలుస్తోంది. నిందితుడు ద్వారకా మండలం నాగులూరుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. బాధితురాలికి దగ్గరి బంధువని, ప్రేమకు నిరాకరించిందనే కారణంతో కక్ష పెంచుకుని ఈ దాడికి పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. ఈ కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

బెంగళూరుకు బాధితురాలి తరలింపు..

దాడిలో తీవ్రంగా గాయపడిన గోపికను తొలుత అనంతపురంలోని సరోజినీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం అవసరమని భావించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థినికి అత్యుత్తమ వైద్యం అందించాలని మంత్రి నారా లోకేష్ మణిపాల్ వైద్యులను కోరారు. బాలికను తరలించే సమయంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరారు.

బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని ఎపి సిఎం ఆదేశాలు

రాప్తాడు ఘటనపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన జరిగిన వెంటనే సీఎంవోతో చర్చించి జిల్లా యంత్రాంగానికి తగిన ఆదేశాలు జారీ చేశారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందిం చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి అండగా నిల వాలని జిల్లా నేతలకు సూచించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా అధికారులతో మంత్రి పయ్యావుల కేశవ్ ఎప్పటికప్పుడు మాట్లాడి వైద్య చికిత్స వివరాలను తెలుసుకున్నారు. మంత్రి సత్యకుమార్ కూడా అనంత పురం ఆసుపత్రిలో బాధితురాలి కుటుంబసభ్యులను పరామర్శించి, బెంగళూరుకు తరలింపు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఐడిబిఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రతిపాదన ..

కేంద్రంపై కెటిఆర్ ఆగ్రహం

బ్యాంకు ఆస్తుల విలువను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త: ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రతిపాదనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు జాతి సంపదని, వాటి విలువను ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి అమ్ముజూపడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. 'ఐడీబీఐ బ్యాంకు విలువను తక్కువగా అంచనా వేస్తున్నారనే నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వచ్చినప్పుడు నిబంధనలు, మదింపు పద్ధతులను ఎందుకు మార్చారు? ఐడీబీఐ ఉద్యో గులు లేవనెత్తుతున్న ఆందోళనలను ఎందుకు పట్టించుకోవడం లేదు?' అని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన నగరాల్లో బ్యాంకుకు అత్యంత విలువైన భూములు, స్థిరాస్తులు ఉన్నాయని, వాటి విలువను సరిగ్గా లెక్కించారా? లేదా? అని ప్రశ్నించారు. "ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ రంగ బ్యాంకును ప్రైవేటుపరం చేసే ముందు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలి. ఇంత తొందర ఎందుకు?" అని ఆయన అన్నారు.

వాతావరణంపై సమష్టి పరిశోధనలు అవసరం

శాస్త్రీయ ఆధారాలతో పంటలపై ఎల్‌నినో ప్రభావం

ఉద్యాన్న వర్సిటీ విసి డాక్టర్ డి. రాజిరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త : మారుతున్న వాతావరణ పరిస్థితులపై సమిష్టి పరిశోధనలు అత్యవసరమని తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి తెలిపారు. విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాలలో నిర్వహించిన క్లైమేట్ ఇంటెలిజెన్స్ రివల్యూషన్, అగ్రిబిజినెస్ మోడలింగ్ జాతీయ స్థాయి బ్రెయిన్‌స్టార్మింగ్ వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం పంటలపై ఎలా ఉంటుందో శాస్త్రీయ ఆధారాలతో నమోదు చేయాలన్నారు. క్లైమేట్ ఇంటెలిజెన్స్ పరిశోధనల కోసం ప్రభుత్వాలు, సంబంధిత సంస్థలు ప్రత్యేక నిధులతో పాటు, కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు.

పర్యావరణ, వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కొనేందుకు వాతావరణ, భూవిజ్ఞాన, వ్యవసాయ, ఉద్యాన అనుబంధ సంస్థలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ అంశంపై సంయుక్త కార్యాచరణ రూపొందించడంతో పాటు, విస్తృత పరిశోధనలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిల్లో వాతావరణ మార్పులు, అగ్రి బిజినెస్ అంశాలపై ప్రత్యేక కోర్సులు ప్రవేశ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు డాక్టర్ ఏ. భగవాన్, డాక్టర్ జే. చీనా, డి. లక్ష్మీనారాయణ, అనిత కుమారి, పి. ప్రశాంత్, సునందిని, భారత వాతావరణ శాఖ, భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ, ఐఐటీలు, ఐసీఏఆర్, జాతీయ పరిశోధనా సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు, నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్ర అభ్యంతరాలకు పరిష్కారం చూపండి

సాగునీటి లక్ష్యాలకు భంగం కలగకుండా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించాలి

వివిధ నీటిమట్టాల్లో ముంపు వివరాలతో సమగ్ర పటాలు సిద్ధం చేయాలి

అధికారులకు ఆచరణాత్మక పరిష్కారాల రూపకల్పనపై దిశానిర్దేశం : మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త : ప్రతిపాదిత తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర వ్యక్తం చేస్తున్న ముంపు, పర్యావరణ సంబంధిత ఆందోళనలకు సాంకేతికంగా సమర్థమైన, ఆచరణసాధ్యమైన పరిష్కారాలు రూపొందించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు సాగునీటి లక్ష్యాలకు భంగం కలగకుండా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించే ఇంజినీరింగ్ మార్పులను పరిశీలించాలని సూచించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో ఇటీవల జరిగిన చర్చలకు కొనసాగింపుగా శనివారం తుమ్మిడిహట్టి బ్యారేజీ సాంకేతిక అంశాలు, ప్రతిపాదిత అలైన్‌మెంట్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. వివిధ జలాశయ నీటిమట్టాల వద్ద ప్రభావితమయ్యే భూముల విస్తీర్ణాన్ని సమగ్రంగా అంచనా వేయాలని స్పష్టం చేశారు.వాస్తవంగా ఎంత మేర ముంపు ఏర్ప డుతుందో నిర్ధారిం చేందుకు వివరమైన పటాలు సిద్ధం చేయాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. నదీగర్భ ప్రాంతాలు, అటవీ భూములు, పర్యావరణ సున్నిత మండలాలు, సంరక్షిత కోర్ ప్రాంతాలు, రెవెన్యూ భూములు, జనావాసాలను పటాల్లో స్పష్టంగా గుర్తించాలని సూచించారు. ఈ వివరాల ఆధారంగా మహారాష్ట్ర ఆందోళనలను పరిష్కరించే మార్గాలను పరిశీలించాలని పేర్కొన్నారు.నీటి నిల్వను, వినియోగాన్ని మెరుగుపరిచేందుకు తుమ్మిడిహట్టి బ్యారేజీ పూర్తిస్థాయి జలాశయ నీటిమట్టాన్ని (ఎఫ్‌ఆర్‌ఎల్) 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. అక్టోబర్ 26న ముంబయిలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో జరిపిన సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించిన విషయం విదితమే.నుందిళ్ల బ్యారేజీ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుతో కూడిన సమగ్ర వ్యవస్థ ద్వారా 77 టిఎంసిల నీటిని మళ్లించి, ఏడు జిల్లాల పరిధిలోని 5.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ప్రస్తుతం ప్రతిపాదిత 148 మీటర్ల నీటిమట్టం వద్ద నిల్వ సామర్థం 2.182 టిఎంసిలు కాగా, 152 మీటర్లకు పెంచితే అది 5.697 టిఎంసిలకు చేరుతుంది. తద్వారా నీటి నిల్వ సామర్థం రెట్టింపునకు మించి పెరుగుతుంది.ప్రతిపాదిత 152 మీటర్ల నీటిమట్టం వద్ద కూడా ముంపు పరిమితంగానే ఉంటుందని ప్రాజెక్టు అంచనాలు సూచిస్తున్నాయి. తెలంగాణ, మహారాష్ట్రల్లో పునరా వాసం, పునఃస్థాపనకు సంబంధిం చిన అవసరాలను పరిష్కరించవచ్చని ఈ అంచనాలు పేర్కొంటు న్నాయి. సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, ఇంజినీర్ ఇన్ చీఫ్ (జనరల్) ఒ.వి. రమేష్‌బాబు పాల్గొన్నారు.



3, 4 తేదీల్లో ఇ-లాటరీ ద్వారా ఇందిరమ్మ టవర్స్ ఇళ్ల కేటాయింపు

యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం

హౌసింగ్ బోర్డు వైస్‌చైర్మన్ వి.పి. గౌతమ్

హైదరాబాద్,అక్టోబరు31,ప్రభాతవార్త: హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలోని మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఎల్ఐజీ ఫ్లాట్ల కేటాయింపు కోసం నవంబరు 3వ తేదీన డ్రా తీయనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి.గౌతమ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముషీరాబాద్, ఎల్బీనగర్, చంద్రాయణ గుట్ట, గోషామహల్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్లలో ఫ్లాట్లకు డ్రా తీయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా గతంలో 16 నియోజకవర్గాల్లో కేటాయించిన ఫ్లాట్లలో వివిధ కారణాలతో రద్దయిన వాటికి నవంబరు 4న మళ్లీ మాప్ అప్ లాటరీ తీయనున్నట్లు తెలిపారు.గతంలో 16 నియోజకవర్గాల్లో వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన వారి జాబితాతో ఆయా నియోజకవర్గాల్లోనే లాటరీ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే క్షేత్ర స్థాయి పరిశీనల్లో కొందరు అనర్హులుగా గుర్తించగా మరికొందరు ప్రస్తుతం డబ్బులు చెల్లించలేమన్నారు. వివిధ కారణాలతో గతంలో కేటాయించిన ఇళ్లను రద్దు చేసి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి నవంబరు 4న లాటరీ ద్వారా కేటాయించనున్నారు. రెండు లాటరీల ప్రక్రియలు ఆన్‌లైన్‌లో ఉంటాయని హౌసింగ్ బ

అర్నబ్‌తో ఆంధ్రకు తీరని నష్టం

విజయకుమార్ ఘంటా

ప్రకృతి అర్నబ్‌గా మారి ఏపీపై విరుచుకుపడింది. చేతికి అందివస్తున్న వరి, ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. ముఖ్యంగా కోస్తాంధ్రలో కీలకంగా, ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలో సుమారు 16 జిల్లాలకు తీరని నష్టం కలిగించింది. రోడ్లు ధ్వంసం అయ్యాయి. రవాణా వ్యవస్థ స్తంభించింది. భారీ వృక్షాలు, చెట్లు నేల కూలాయి. విద్యుత్తు స్తంభాలు ఒరిగాయి. పట్టణాలు, పల్లెల్లో రెండురోజుల పాటు అంధకారం నెలకొంది. కొన్ని గంటల వ్యవధిలోనే అర్నబ్ విధ్వంసాన్ని సృష్టించింది. ప్రభుత్వం యుద్ధ ప్రతిపాదిక చర్యలతో తుఫాన్ ప్రభావం నుంచి ప్రభావిత ప్రాంతాలు మెరుగుపడుతున్నాయి. ప్రజలు తేరుకుంటున్నారు. విద్యుత్, రవాణా సౌకర్యాలు క్రమంగా అందుబాటులోకి వస్తున్నాయి. అర్నబ్ తుఫాను అక్టోబర్ 28 తెల్లవారుజామున 2 గంటల నుండి 8 గంటల మధ్య యానాంకు దక్షిణంగా, నర్సాపూరం సమీపంలో తీరం దాటింది. ల్యాండ్ ఫాల్ సమయంలో గాలులు గంటకు 125 - 135 కిలో మీటర్ల వేగంతో గరిష్టంగా 150 కిమీల వేగం వరకు వీచాయి. తుఫాను దాదాపు 10 గంటల పాటు తీరం వెంబడే ఉండిపోయింది. ఈ క్రమంలో ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల వలన ప్రాణ నష్టం భారీ జరగలేదు. అయితే పలువురు తుఫాను కారణంగా చెట్లు విరగడం, విద్యుత్తు స్తంభాలు కూలడం వంటి అనుహ్య ఘటనలో మృత్యువాత పడ్డారు. తాజా లెక్కల ప్రకారం 6 నుంచి 7 మంది వరకు మృతి చెందినట్టు ప్రభుత్వం ప్రకటించింది. విశాఖలో ఇద్దరు, అనకాపల్లి, కోనసీమ, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లాలో చెట్టు విరగడం, కరెంట్ స్తంభం పడిపోవడం, పది మంది వరకు మృతి చెందినట్లు సమాచారం. అర్నబ్ తుఫాన్ ప్రభావంతో భారీగా పంట నష్టం జరిగింది. పంట నష్టంపై సీఎం చంద్రబాబునాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కేంద్రానికి రాసిన లేఖల ప్రకారం 14 జిల్లాల్లో 2,24,489 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి, 3.45 లక్షల మంది రైతులు నష్టపోయారు. ఇందులో వరి ఒక్కటే 2,09,460 హెక్టార్లు ఉంది. తాజాగా ప్రభుత్వ అంచనా ప్రకారం 16 జిల్లాల్లో 3,33,268 హెక్టార్ల వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి గోదావరి జిల్లాలు భారీగా నష్ట పోయాయి. పశ్చిమ గోదావరి 76,176 హెక్టార్లు, కోనసీమ 44,232 హెక్టార్లు, కాకినాడ 42,222 హెక్టార్లులో కోతకు వచ్చిన వరి నీట మునిగి మొలకెత్తడం, రంగు మారడం జరిగింది. ఉద్యాన, కొబ్బరి, అరటిపంటలకు అనుహ్యంగా నష్టం వాటిల్లింది. 12,763 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి అరటి, కొబ్బరి చెట్లు నేలకూలాయి, కూరగాయలు,



బొప్పాయి, పూల తోటలు నీట మునిగాయి. కోనసీమలో 8 వేల కరెంట్ స్తంభాలతో పాటు వేలాది కొబ్బరి చెట్లు కూలాయి. రైతుల లెక్కప్రకారం ఎకరా వరికి రూ.40 వేలు, అరటికి రూ.2 లక్షలు, ఆక్వాకు ఎకరాకు రూ.45 లక్షల వరకు నష్టం వచ్చిందనే వాదన వెలుగులోకి వచ్చింది. ఆస్తి, మౌలిక వసతుల నష్టం కుడా భారీగా జరిగింది. మొత్తం నష్టం ప్రాథమిక అంచనా రూ.4,600 కోట్లుగా ప్రభుత్వం వెల్లడించింది. 15,000 కరెంట్ స్తంభాలు కూలాయి, 2,396 కి.మీ రోడ్లు దెబ్బతిన్నాయి, 31ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి, 714గ్రామాలపై ప్రభావం పడింది. కాకినాడలో ఉప్పాడ తీరప్రాంత రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. గతంలో ఎన్నడులేని విధంగా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ వర్షపాతానికి మించి వానలు పడ్డాయి. విశాఖలో 21-23సెం.మీ, విజయనగరం 18 సెం.మీ, శ్రీకాకుళం 14 సెం.మీ వర్షం నమోదైంది. గోపాలపట్నంలో అత్యధికంగా 32.3 సెం.మీ కురిసింది. దీనివల్ల రాష్ట్ర సగటు వర్షాభావం 39 నుండి 27కి తగ్గింది. ఏపీ ప్రభుత్వ సహాయక చర్యలు పరంగా చూసినప్పుడు ప్రభుత్వం అత్యంత దూరదృష్టితో వ్యవహరించింది. అర్నబ్ గురించి వాతావరణ శాఖ హెచ్చరించిన వెంటనే సీఎం చంద్రబాబు ఆర్టీజీఎస్‌ను అప్రమత్తం చేసారు. అక్టోబరు 26 నుంచి ఇప్పటికి వరకు ఆయన ఆర్టీజీఎస్‌ను ఇతర యంత్రాంగాలతో గంటగంటకు సమన్వయం చేసుకుంటూ పరిస్థితులు సమీక్షించారు. నష్టపరిహారానికి సంబంధించి ప్రభుత్వం జీవో జారీ చేసిందని, పంట నష్టం మినహా మిగిలిన బాధితులకు పరిహారం అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. మచిలీపట్నం డివిజన్‌లో 6 సెం.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మచిలీపట్నం ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో 10సెంటీమీటర్లు, కోడూరు మండలంలో 9, చల్లపల్లి మండలంలో 7 సెం.మీ.వర్షపాతం రికార్డయింది. మచిలీపట్నంలో తీవ్ర ప్రభావం కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో తుపాను ప్రభావం తీవ్రంగా ఉంది. కలెక్టరేట్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల ప్రభావంతో రోడ్లపైకి నీరు చేరి పలుప్రాంతాలు జలమయంగా మారాయి. బలమైన ఈదురుగాలులు, వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. ఒక్కసారిగా మారిన వాతావరణ పరిస్థితులు నగర ప్రజలను ఆందోళనకు గురి చేసాయి. రోడ్లపై పడిపోయిన చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం, అల్లూరి, మన్యం, అనకాపల్లి జిల్లాలు అప్రమత్తంగా ఉండాలి. రెండు జిల్లాలు తప్ప అన్ని గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరించాం. కోనసీమ, ప.గో. జిల్లాల్లో వాతావరణం అనుకూలించక పనులు ఆలస్యం అయినట్లు క్షేత్ర పర్యటనలో సీఎం వెల్లడించారు. రెండు జిల్లాలు తప్ప అన్ని జిల్లాల్లో సాయంత్రానికి విద్యుత్ పునరుద్ధరిస్తాం. కోనసీమ, ప.గో. జిల్లాల్లో విద్యుత్ పునరుద్ధరిస్తామన్న సీఎం చంద్రబాబు, ఇంధన శాఖామంత్రి ఆ దిశలో కార్యచరణకు ఆదేశించారు. దాదాపు 15 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. నష్టం అంచనాకు కేంద్ర బృందాన్ని పంపాలని కోరామని వెల్లడించారు. అధికారులకు పంట నష్టాన్ని త్వరితగతిన అంచనా వేసేందుకు సాంకేతికతను వినియోగించాలని, రైతుల వారీగా వివరాలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు తన వరుస సమీక్షా సమావేశాల్లో సూచించారు. నీట మునిగిన పంటలను ఎంతవరకు కాపాడవచ్చో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు అధ్యయనం చేయాలని తెలిపారు. పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన చర్యలతోపాటు కొబ్బరిసహా ఉద్యాన పంటల చెట్లు, మొక్కలను తిరిగి నాటే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన రైతుల నష్టాన్ని భర్తీచేసేందుకు అందుబాటులో ఉన్న వివిధ పథకాలను వర్తింపజేయాలని సూచించారు. త. తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 126.165 కి.మీ మేర ఆర్‌అండ్‌బీ రహదారులకు నష్టం జరిగింది. తుఫాను తీరందాటిన వెంటనే ఆయన అక్టోబరు29నుంచే క్షేత్ర స్థాయి పర్యటనలు ప్రారంభించారు.బాధితులను స్వయంగా పరామర్శించారు. బాధిత కుటుంబాలకు భారీ నష్టపరిహారం ప్రకటించారు. బాధితులకు తక్షణ సహాయం అందించే దిశలో అధికార యంత్రాన్ని ఆదేశించారు.ఈ క్రమంలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం2,131 తుఫాను షెల్టర్లు, 1,087 వైద్య బృందాలు ఏర్పాటు చేసింది. 8,281 ఎమర్జెన్సీ బెడ్లు ఏర్పాటు చేసింది. 55,000 నుంచి 57,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సీఎం చంద్రబాబు ఆర్టీజీఎస్ కేంద్రం నుండి 4 రోజుల్లో 9సమీక్షలు,32వేల మంది అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.34వేల మంది సిబ్బంది చెట్లు,స్తంభాలు తొలగింపులో కీలకంగా వ్యవహరించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. ఇళ్లు మునిగిన కుటుంబాలకు 25 కిలోల బియ్యం, శిబిరాల్లో ఉన్నవారికి రూ.1000, మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50కిలోల బియ్యంతో నిత్యావసరాలు అందజేసారు. పంటనష్టానికి గమనిస్తే అరటికి హెక్టారుకు రూ.35వే, టమాటా, పత్తి, చెరకుకు రూ.25వేల,కొబ్బరి, ఆయిల్ పామ్‌చెట్టుకు రూ.1,500చొప్పున పరిహారం ప్రతిపాదనలు చేశారు. కేంద్రపరంగా గమనించినప్పుడు తుఫాన్ సహాయం విషయంలో స్పందించింది. ●

ఈరోజు గత వారంరోజులపై తాజాగా

ధనుష్టంకారం!

ఎ.వి.వి ప్రసాద్

కొల్లను ముల్లుతోనే తీయాలంటారు. తమిళ రాజకీయాల్లో ఇప్పుడు అటువంటివ్యూహ రచనే జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ప్రముఖ తమిళ నటుడు ధనుష్ రాజకీయ అరంగేట్రం చేయబోతున్నాడనీ, కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నాడనీ ప్రచారం ఉధృతంగా సాగుతుండడంతో రాజకీయ పరిణామాలపై ఊహాగానాలు పెరుగుతున్నాయి. కొద్ది నెలల క్రితమే ముఖ్యమంత్రి అయిన ప్రముఖ నటుడు విజయ్‌కి మద్దతు ఎంత అధికంగా ఉన్నదో, రాజకీయ పార్టీల నుంచి వ్యతిరేకత కూడా అంతే ఉంది. డిఎంకె పార్టీ అధినేత స్టాలిన్ విజయ్‌ని మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నారు. విజయ్ అధి కారంలోకి రాకుండా అడ్డుకొనడానికి అప్పట్లో ఎందరో ప్రయత్నించారు. కాంగ్రెస్ హఠాత్తుగా ప్లేటు ఫిరాయించి డిఎంకె కూటమి నుంచి బయటకు వచ్చి విజయ్ పార్టీ టివికెకు మద్దతు ప్రకటించడంతో ఆరు నెలల క్రితం సమీకరణాలు మారాయి. విజయ్ అధికారంలోకి వచ్చినతర్వాత ఎన్నో సంక్షేమ పథకాలు, తన మార్కుపాలనతో ప్రజాభిమానం పెంచుకుంటున్నా ఇప్పటికీ ఆయన పార్టీ సాధారణ మెజారిటీకి అల్లంత దూరంలోనే ఉంది. మద్దతు ఇస్తున్న కాంగ్రెస్ గానీ, ఇతర పార్టీలు కానీ ఉపసంహరించుకొంటే ప్రభుత్వ మనుగడ కష్టమే. ఈ నేపథ్యంలో ధనుష్ రాజకీయ ప్రవేశం వార్త తమిళనాట అధికసంచలనం సృష్టిస్తున్నట్లే కనిపిస్తోంది. గతవారం ధనుష్ చెన్నైలో నిర్వహించిన ఓ భారీ కార్యక్రమం ఆయన భవిష్యత్ వ్యూహాలపై అంచనాలను పెంచింది. 'ధనుష్ నర్పణి ఇయక్కం' (ధనుష్ సేవా ఉద్యమం) పేరిట నిర్వహించిన ఆ కార్యక్రమంలో ఆయన్ని ఓ పెద్ద రాజకీయ నాయకునిగా అభిమానులు నినదించడం చూస్తే అంతా ఓ ప్రణాళిక ప్రకారమే చేస్తున్నట్లు అర్థమవుతుంది. దారి పొడవునా కిలోమీటర్ల మేర ధనుష్ ఫొటోలు, బ్యానర్లు, ప్లెక్సీలను అభిమానులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.'తలైవా ధనుష్' అనే పోస్టర్లు కూడా వెలిశాయి. వేదికపై ప్రసంగించే సమయంలో ధనుష్ అటువంటి రాజకీయమాట లేమీ అనకపోయినా 'నేను ఎవ రికీ శత్రువును కాను. ప్రజల కోసమే పని చేస్తున్నా' అని పలుమార్లు అనడం ఆలోచింపచేస్తోంది. ఆ వేడుకకు దాదాపు నాలుగు వేల మంది మహిళలకు ఆహ్వానాలు అందాయనీ, అంతకు రెట్టింపు మందే కార్యక్రమంలో కనిపించారనీ అంటున్నారు. వచ్చిన మహిళలం దరికీ ధనుష్ 'కామాక్షి విళక్కు' లను కానుకగా అందించారు. కామాక్షి దీపం అనేది తమిళనాట ఓ సెంటిమెంటు. దానిని వెలిగిస్తే శుభయోగమని విశ్వాసం. ధనుష్ అటువంటి దీపం కుందులు కానుకగా ఇవ్వడం కూడా ఇప్పుడు ఆసక్తికరమైన చర్చగా మారింది. ధనుష్ రాజకీయ పార్టీని స్వయంగా ప్రకటించకపోయినా, అక్కడికి వచ్చిన వేలాది అభిమానులు ఆయన్ని తలైవర్‌గా నినదించడం చూస్తే ధనుష్ త్వరలోనే రాజకీయ పార్టీని ప్రకటించవచ్చనే అభిప్రాయం కలుగుతుంది. అయితే కుందుల కింది భాగంలో కమలం గుర్తు కనిపించడం దేనికి సంకేతమో మరి! ఆయన బిజెపిలో చేరవచ్చునా లేక ఆయిన పార్టీకి బిజెపి మద్దతు ఉంటుందనా? ఒకటి మాత్రం వాస్తవం. విజయ్‌కి వ్యతిరేకంగా సమీకరణాలు బాగా జరుగుతున్నాయి. ధనుష్ ఎదురుగా పెట్టి చక్రం తిప్పాలని కొన్ని పార్టీలు యోచించవచ్చు. ఈసారి తమిళనాట అధికారంలోకి రావాలనే ఆలోచన బిజెపిలో బలంగానే ఉంది. అన్నాడిఎంకె బిజెపికి మిత్రపక్షమే. ఇప్పుడు డిఎంకె కూడా అటే జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఈ పార్టీలన్నీ ధనుష్ ను తెరపైకి తెస్తే రాజకీయ దృశ్యం మారిపోయే అవకాశం ఉంది. తమిళ సినిమా, రాజకీయాలపై తిరుగులేని ప్రభావం చూపగల రజనీకాంత్‌కు ధనుష్ మాజీ అల్లుడే అయినా ఇద్దరి మధ్య సత్సంబంధాలే కొనసాగుతున్నాయి. ధనుష్ రాజకీయాల్లోకి వస్తే రజనీకాంత్ ఆశీస్సులు తప్పక ఉంటాయి గనుక ఆయా పార్టీల కళ్లు ఆయనపై పడడంలో ఆశ్చర్యం లేదనిపిస్తుంది. అయితే ధనుష్ కొత్త పార్టీని పెడతారా,లేక ఏ పార్టీలోనైనా చేరుతారా అనేది ఇంకా తేలవలసి ఉంది. తమిళ మీడియా చేస్తున్న ప్రచారాన్ని బట్టి చూస్తే ఆయన అతి త్వరలోనే కొత్త పార్టీని ప్రకటించబోతున్నారనే విషయం స్పష్టమవుతుంది. ఆయన పార్టీకి బిజెపితో పాటు అన్నాడిఎంకె, డిఎంకె, మరి కొన్ని పార్టీల మద్దతు లభిస్తుందనీ, మధ్యంతర ఎన్నికలు వస్తాయనే ప్రచారం కూడా జరుగుతోంది. ఇప్పుడు మద్దతు ఇస్తున్న కొన్ని పార్టీలు ఉపసంహరించుకొంటే అవిశ్వాస తీర్మానం ద్వారా విజయ్ ప్రభుత్వాన్ని పడగొట్టాలనే వ్యూహంతో కొన్ని విపక్షాలు ఉన్నట్లు కూడా ప్రచారమవుతోంది. సినిమా రంగంలో విజయ్ కంటే ధనుష్ పదేళ్లు జూనియర్. కానీ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ధనుష్‌కు విజయ్ కంటే ఎక్కువ ఆదరణేఉంది.రజనీకాంత్‌తో ఉన్న అనుబంధం ఆయనకు మరో ప్లస్ పాయింట్. మాస్ హీరోగా విజయ్‌కి పేరుంటే అవార్డు చిత్రాల విలక్షణ నటుడిగా ధనుష్‌కు ప్రేక్షకాదరణ ఉంది. బాక్సాఫీస్ కోణం నుంచి చూసినా విజయ్ కంటే ధనుష్‌కు తక్కువేమీ లేదనే చెప్పాలి. సినిమా విజయాలను రాజకీయ ఓటు బ్యాంకుతో పోల్చలేం కానీ ఆ అభిమానుల ప్రభావం ఎన్నికలపై ఎంతోకొంత పనిచేస్తుందనే చెప్పాలి. ప్రస్తుతం ఒక్కసీటు మాత్రమే ఉన్న బిజెపి కనీసం 120 సీట్ల మద్దతుతో అధికార చక్రం తిప్పాలనుకొంటే ధనుష్‌లాంటి సినిమా హీరోల మద్దతుతో పాటు డిఎంకె, అన్నాడిఎంకె వంటి పార్టీల మద్దతు కూడా చాలా అవసరం. వచ్చే ఎన్నికల లోగా ఇందుకు అవసరమైన సమీకరణాలు జరిగేసూచనలైతే కనిపిస్తున్నాయి. గతవారం ధనుష్ చేసిన 'ధనుష్టంకారం' భవిష్యత్తులో ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందో చూడాలి. వాటిని ఎదుర్కొనడానికి విజయ్ ఎత్తుగడలు ఎలా ఉంటాయన్నది కూడా చాలా ఆసక్తికరమే. ●



హీరో ధనుష్

న్యాయవ్యవస్థలో తిరుగుబాటు

గన్ని మోహన్

మధ్యయూరోప్ దేశం పోలాండ్‌లో ప్రపంచంలోనే ఎన్నడూ లేనివిధంగా న్యాయవ్యవస్థలో తిరుగుబాటు చోటుచేసుకోవడం ఇరుగు పొరుగుదేశాలను నివ్వెరపరుస్తోంది. పోలెండ్ ఆదేశ రాజ్యాంగ న్యాయస్థానంలో తీవ్ర వివాదం చెలరేగింది. కేసుల విచారణకు అనుమతి లేని న్యాయమూర్తి అన్నా కోర్విన్ పియోట్రోవ్‌స్కా,న్యాయస్థానం అధ్యక్షుడుబోగ్డాన్ స్వియెంచ్కోవ్స్కి,తో పాటు ఆయన డిప్యూటీని నెల రోజుల పాటు సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసి తిరుగుబాటును ప్రకటించడం చూస్తే రాజ్యాంగబద్ధమైన న్యాయవ్యవస్థలోనే సంక్షోభానికి దారితీసింది. తానే కోర్టు అధ్యక్ష బాధ్యతలు చేపట్టినట్లు పియోట్రోవ్‌స్కా ప్రకటించుకున్నారు. ఆమె చర్యలను అత్యున్నత న్యాయస్థానం అధ్యక్షుడుగా ఉన్న స్వియెంచ్కోవ్స్కి తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఒకరకమైన కూప్ డిఎటా అంటే తిరుగుబాటు అని ఆరోపించారు. గతంలో అధికారంలో ఉన్న జాతీయవాద లా అండ్ జస్టిస్ పార్టీప్రవేశపెట్టిన న్యాయవ్యవస్థ సంస్కరణలను మార్చేందుకు ప్రధాని డొనాల్డ్ టస్క్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. పిఐఎస్ పార్టీ ఎనిమిదేళ్ల పాలనలో రాజ్యాంగ న్యాయస్థానానికి పలువురు న్యాయమూర్తులను నియమించింది. వారిలో స్వియెంచ్కోవ్స్కి, ఆయన డిప్యూటీ కూడా ఉన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత, చట్టబద్ధ పాలన అంశాలపై పోలాండ్, యూరోపియన్ యూనియన్ మధ్య వివాదాలకు ఈ న్యాయస్థానం కేంద్రంగా మారింది. పిఐఎస్ పార్టీ అధినేత యారోస్లావ్ కచిన్స్కి నిరసనలకు మద్దతు పలుకుతూ ప్రధాని టస్క్ ఈ సంస్థపై తిరుగుబాటు చేస్తున్నారని, పోలాండును పోలీసు రాజ్యంగా మారుస్తున్నారని ఆరోపిస్తూ అధ్యక్షుడు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.పిఐఎస్ పార్టీకి మద్దతుదారుడిగా, టస్కు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న అధ్యక్షుడు కరోల్ నవ్రోకీ సెనెగల్ పర్యటనను మధ్యలోనే ముగించుకుని పోలాండుకు తిరిగివచ్చి పరిస్థితిని సమీక్షించడం జరిగినా ప్రధాని టస్క్ మాత్రం తన ప్రభుత్వ చర్యలను సమర్థించుకున్నారు. చట్టబద్ధ పాలనను పునరుద్ధరించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. పిఐఎస్ పాలనలో జరిగిన చట్టవిరుద్ధ చర్యల



అన్నా కోర్విన్

తర్వాత పరిస్థితులను సరిచేయడం నా బాధ్యత అని అందుకే గత ప్రభుత్వం న్యాయవ్యవస్థలో జోక్యాన్ని రద్దుచేస్తున్నట్లు చెపుతూ కొన్నిసార్లు బాధాకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.దీనికి మరోమార్గం లేదని తనచర్యలుసమర్థించుకున్నారు. పోలాండ్ రాజ్యాంగ న్యాయస్థానానికి చట్టాలను రద్దు చేసే అధికారం ఉంది. గత పిఐఎస్ ప్రభుత్వహయాంలో అబార్షన్లపై దాదాపు సంపూర్ణ నిషేధం విధించే చర్యలకు ఈ కోర్టు మద్దతు ఇచ్చింది. అసలు ఈ తాజా సంక్షోభానికి మూలాలు 2015 లో ఉన్నాయి. అప్పట్లో పిఐఎస్ పార్టీ రాజ్యాంగ న్యాయస్థానానికిపలువురు న్యాయమూర్తులను నియమించింది. ఆ నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయని 2021లో యూరోపియన్ మానవ హక్కుల న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ వివాదం క్రమంగా పోలాండ్, యూరోపియన్ యూనియన్ మధ్యతీవ్రస్థాయి ఘర్షణకు దారితీసింది. న్యాయవ్యవస్థ స్వతంత్రతపై ఆందోళనలతో యూరోపియన్ యూనియన్ పోలాండ్‌కు అందించే నిధులను నిలిపివేసింది. 2023 డిసెంబర్లో తిరిగి అధికారంలోకి వచ్చిన టస్క్ ప్రభుత్వం రాజ్యాంగ న్యాయస్థానంలోని కొన్ని నియామకాల చట్టబద్ధతను ప్రశ్నించింది. కోర్టు ఇచ్చిన కొన్ని తీర్పులను గెజిట్ ప్రచురణ కూడా నిలిపివేసింది. న్యాయమూర్తుల నియామకాలతో సహా ప్రభుత్వ ప్రతిపాదనల్లో కొన్నింటిని అడ్డుకున్నారు. వీటో చేశారు. వచ్చే ఏడాది పోలాండ్ పార్లమెంటరీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజ్యాంగ న్యాయస్థానంపై నియంత్రణ కోసం సాగుతున్న ఈ పోరు ప్రభుత్వ, అధ్యక్ష వ్యవస్థ, న్యాయవ్యవస్థల మధ్య అధికార మార్పిడికి కీలక పరీక్షగా మారుతోంది. ●

మానవాళి పాలిట శాపంగా మారుతున్న సాంకేతికత



సుంకవల్లి సత్తిరాజు

ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ మానవాళి మనుగడకు శాపమని ఇప్పటికే పలువురు ప్రముఖులు హెచ్చరించారు. ఉన్న ఉద్యోగాలు ఊడి పోతున్నాయి. కొత్త ఉద్యోగాలు కొండెక్కాయి. ఎఐ నెమ్మదిగా తన పంజా విప్పింది. భవిష్యత్తులో పని చేసే అవకాశముండదని, ఆర్థిక వ్యవస్థలతో సంబంధం లేని రోబోల శకం ప్రారంభమైనదని, వచ్చే పదేళ్లలో ప్రపంచ రూపు రేఖలు, జీవన విధానం ఊహాతీతంగా ఉండబోతున్నదని ఎలాన్ మస్క్ పేర్కొనడం ఒక హెచ్చరికగానే భావించాలి. ఇప్పటికే విలువలు నశించిపోయిన సమాజంలో ఏఐ టూల్స్ విపరీతమైన ధోరణులను ప్రేరేపిస్తున్నాయి. నైతికతకు సవాల్ విసురుతున్న సాంకేతికత పరిధిని గుర్తించాలి. ఇటీవల భారత దేశంలోను, ప్రపంచ వ్యాప్తంగాను 'డీప్ ఫేక్' అనే అంశం ప్రధాన చర్చనీయాంశంగా మారింది. కృత్రిమ మేధ (ఏఐ) తో సృష్టించిన డీప్‌ఫేక్ గురించి సామాన్య ప్రజలకు తెలియక పోవచ్చు. కాని విద్యావంతులకు, సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన ఉద్యోగులకు, సాంకేతిక మాధ్యమాల్లో మునిగి తేలుతున్న యువతకు 'డీప్ ఫేక్' గురించిన సమాచారం, వైరల్‌గా మారిన సెలబ్రిటీలకు సంబంధించిన వీడియోల గురించి, కృత్రిమ మేధ వలన ఏర్పడుతున్న పరిణామాల గురించి, డీప్ ఫేక్ టెక్నాలజీ వలన మహిళల భద్రతకు ఏర్పడుతున్న ముప్పు గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే సాంకేతిక పరిజ్ఞానం గురించి ఏ మాత్రం తెలియని ప్రజలకు, సామాజిక మాధ్యమాల వెంటబడుతున్న యువతకు, పాఠశాల విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు 'డీప్ ఫేక్' గురించిన కనీస ప్రాథమిక జ్ఞానం అందించాలి. భవిష్యత్తులో దీనివలన ఏర్పడే పరిణామాలపై అవగాహన కలిగించి, అప్రమత్తంగా మెలగవలసిన అవసరాన్ని తెలియ చెప్పాలి. సాంకేతిక ప్రపంచంలో, సోషల్ మీడియా వేదికల్లో భయంకరమైన అలజడి సృష్టించిన 'డీప్ ఫేక్' టెక్నాలజీ గురించి సవివరంగా చర్చించాలి. డీప్ లెర్నింగ్ టెక్నాలజీతో కల్పితమైన అశ్లీలమైన దృశ్యాలను సృష్టించి, వ్యాప్తి చేసే ఒక హానికరమైన సృజనాత్మక కళగా 'డీప్ ఫేక్' ను అభివర్ణించవచ్చు. డీప్ లెర్నింగ్ అనేది ఒక తరహా మెషీన్ లెర్నింగ్. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ డీప్ లెర్నింగ్‌ల కలయికతో 'డీప్ ఫేక్' ఆవిర్భావం జరిగింది.1990 వ దశకంలోనే దీనికి అంకురార్పణ జరిగినట్టు కొంత సమాచార ముంది. 'డీప్' 'ఫేక్' అనే రెండు వేర్వేరు పదాల అర్థాలను, శబ్దాలను కలపడం వలన 'డీప్ ఫేక్' ఏర్పడింది.'డీప్ ఫేక్' అనేది ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఆధారిత అభూత కల్పనల కృత్రిమ సాంకేతిక మాధ్యమం. దీనినే 'సింథటిక్ మీడియా' అంటారు. ఇదొక కల్పిత దృశ్యాలతో కూడిన కథనాలకు వేదిక. 'డీప్ ఫేక్'ను కృత్రిమ మేధస్సుకు మానస పుత్రికగా అభివర్ణించడంలోఅతిశయోక్తి లేదు. గూగూల్, ఫేస్‌బుక్, మైక్రో సాఫ్ట్ వంటి దిగ్గజాలు కృత్రిమ మేధస్సు పరిశోధనల్లో, వినియోగంలో ముందంజలో ఉన్నాయి. అమెరికా, చైనా, సింగపూర్, యుకె, జపాన్, సౌత్ కొరియా వంటి దేశాలు కృత్రిమ మేధస్సు అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉన్నాయి. చాట్ జిపిటి ప్రభావాన్ని చూస్తున్నాం. ఈ సాంకేతిక ప్రక్రియ ఓపెన్ ఏ.ఐ ద్వారా ప్రారంభించబడింది. ఇది కృత్రిమ మేధస్సుతో పని చేసే వినూత్న సాంకేతిక ప్రక్రియ. మనిషిని పోలిన



యాంత్రిక శక్తిని, కృత్రిమ మేధస్సును ఉపయోగించడం వలన సత్వర ఫలితాలు స్వల్పవ్యవధిలో సిద్ధిస్తాయి. చంద్రయాన్ 3 దక్షిణ ధృవంపై దిగిన సందర్భంలో విక్రమ్ ల్యాండర్‌ని నియంత్రించడంలో ఏఐ టెక్నాలజీని వినియోగించారు. ఏఐ ప్రక్రియను రోబోల తయారీలోను, వాహనాలను నడపడానికి, సామాజిక మాధ్యమాల్లోను వినియోగిస్తున్నారు. డీప్ ఫేక్ రెండు దశాబ్దాల క్రితమే ప్రారంభమై ప్రస్తుతం విస్తృత పరిధిని ఏర్పరచుకుంది. సింథసిస్ టెక్నిక్ ప్రతిస్పందన, సంభాషణ దీని ప్రత్యేకతలు. పలు విషయాల్లో సహకారానికి, వివరణలకు, విశ్లేషణలకు, కోడింగ్‌కు చాట్ జిపిటి ఉపకరిస్తుంది. మానవ శక్తిని, యుక్తిని, అపరిమితమైన మేధస్సును సాంకేతిక వ్యవస్థలకు అన్వయించి, వాటి ద్వారా అలవోకగా పనులను చక్కబెట్టే మార్గం 'కృత్రిమ మేధ'. మానవ జీవితాలను మరో ప్రపంచం వైపు తీసుకుపోయే వినూత్న సాంకేతిక విప్లవానికి నాందిగా 'ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్'ను పేర్కొనవచ్చు. మానవ శక్తి కంటే

లతో అశ్లీలమైన వీడియోలను సృష్టించి, సామాజిక మాధ్యమాల్లో ప్రదర్శించడం, ఫేస్‌బుక్, ఇన్‌స్టా వంటి సోషల్ మీడియా అకౌంట్లను హ్యాక్ చేయడం, వాట్సాప్ ద్వారా కాల్స్ చేసి, మన వాయిస్‌లను రికార్డు చేసి, ఆర్థిక పరమైన మోసాలకు వినియోగించుకోవడం జరుగుతున్నది. ఈ ప్రక్రియలో లైంగిక పరమైన దృశ్యాలను ఏఐ ద్వారా సృష్టించి స్త్రీల జీవితాలను ప్రభావితం చేయడం ద్వారా వారి పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా దారుణమైన దుష్ప్రత్యాలకు పాల్పడుతున్న వర్తమాన ప్రపంచంలో విలువలకు, నైతికతకు చోటెక్క? డీప్‌ఫేక్‌తో అసభ్య వీడియోలను తయారు చేసి, పోర్న్ సైట్‌లో అప్ లోడ్ చేస్తున్నారు. ఇలాంటి చర్యల వలన కుటుంబాలు కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఫేక్ కంటెంట్ సృష్టించి బెదిరించి డబ్బులు వసూలు చేయడం, లొంగకపోతే ఫోర్న్ సైట్‌లో పోస్ట్ చేయడం వంటి మార్గాలను డీప్

విపక్షం కాదు.. అడ్డంకుల పక్షం

- ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ ఫైర్ - విదేశాలకు వెళ్లి ఎవరు ఎవరిని కలుస్తున్నారో ప్రజలకు తెలుసు - గుజరాత్ ఏక్తానగర్ పెరేడ్ గ్రౌండ్స్ సభలో ప్రధాని



శనివారం ఏక్తానగర్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోడీ

ఏక్తా నగర్,అక్టోబరు 31: ప్రతిపక్షం తన పాత్రను నిర్మాణాత్మకంగా నిర్వహించకుండా, దేశాభివృద్ధికి అడ్డంకిగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విమర్శించారు. ప్రతిపక్షం విరోధ్ పక్ష్‌గా కాకుండా అవరోధ్ పక్ష్‌గా మారిందని వ్యాఖ్యానించారు. దేశం ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. గుజరాత్‌లోని ఏక్తా నగర్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవ కార్యక్రమంలో మోడీ ప్రసంగించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ ప్రతిపక్షం అవరోధ్ పక్ష్‌గా మారడం మన దురదృష్టం అని అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలను పరోక్షంగా ప్రస్తావిస్తూ విదేశాల్లో రహస్యంగా ఎవరు ఎవరిని కలుస్తున్నారు భారత్‌కు వ్యతిరేకంగా ఉన్న శక్తులు ఎవరికి మద్దతు ఇస్తున్నాయి భారతదేశ శత్రువుల భాషను ఎవరు మాట్లాడుతున్నారు అని ప్రశ్నించారు. ఇలాంటి శక్తులకు వ్యతిరేకంగా దేశం ఐక్యంగా నిలవాలని మోడీ పిలుపునిచ్చారు. దేశ ప్రజల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సోషల్ మీడియాను ఆయుధంగా ఉపయోగించుకుంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, పుకార్లు వ్యాప్తి చేస్తూ భారత్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. గత ఏడాది తాను ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ దేశాన్ని నక్సలిజం, మావోయిజం నుంచి విముక్తి చేసే వరకు విశ్రమించబోమని చెప్పానని, ఆ హామీని నెరవేర్చామని మోడీ పేర్కొన్నారు. నక్సల్స్‌ను అంతం చేసినప్పటికీ, మానసిక నక్సల్స్‌ముప్పు మాత్రం ఇంకా అధికంగానే ఉందని వ్యాఖ్యానించారు. దేశం ముందున్న తదుపరి ప్రధాన లక్ష్యాలను కూడా ప్రధాని వివరించారు. దేశ సరిహద్దులను పూర్తిస్థాయిలో భద్రపరచడం, అక్రమ చొరబాట్లను అడ్డుకోవడం, జనాభా స్వరూపంలో మార్పులను నివారించడం, లౌకిక పౌర చట్టం దిశగా ముందుకు సాగడం వంటి అంశాలు ముఖ్యమైనవని తెలిపారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్, వికసిత భారత్ తమ రెండు ప్రధాన లక్ష్యాలని మోడీ స్పష్టం చేశారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన మార్గంలోనే దేశం ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఆనాడు ఏక్‌భారత్‌శ్రేష్ఠ్ భారత్ భావనతోనే పటేల్ దేశంలోని సంస్థానాలన్నింటినీభారత్‌లో విలీనంచేసారని గుర్తు చేసారు.

స్వాతంత్ర్య పోరాటంలో పటేల్ చూపిన తెగువ, సాహస నిర్ణయాలు నేటితరం, భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు.

రూ.426 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు.



మోడీ హయాంలోనే పటేల్ సేవలకు గుర్తింపు

సర్దార్‌పటేల్‌ను పక్కనపెట్టిన కాంగ్రెస్!

గుజరాత్‌లో హోంమంత్రి అమిత్‌షా

ఏక్తానగర్, అక్టోబరు 31: సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు దక్కాల్సిన గౌరవం కాంగ్రెస్ పాలనలో లభించలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఆయనను పక్కనపెట్టి, ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేసేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రయత్నించిందని ఆరోపించారు. పటేల్ 151వ జయంతి సందర్భంగా శనివారం ఢిల్లీలో నిర్వహించిన ఏక్తా రన్ కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ హయాంలోనే సర్దార్ పటేల్ స్మారకంగా ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహమైన స్టాచ్యూ ఆఫ్ యూనిటీని నిర్మించారని షా గుర్తుచేశారు. ఈ స్మారక నిర్మాణం ద్వారా పటేల్ సేవలు, ఆయన వ్యక్తిత్వాన్ని దేశవ్యాప్తంగా ప్రజలకు పరిచయం చేశారని పేర్కొన్నారు. దేశ సమైక్యతకు పటేల్ చేసిన కృషిని అమిత్ షా ప్రస్తావించారు. కేవలం 1,218 రోజుల్లోనే ఆయన అవిభాజ్య భారతదేశ నిర్మాణానికి పునాది వేశారని అన్నారు. పలువురు నాయకులు కలిసి జీవితకాలంలో సాధించలేని పనులను పటేల్ తక్కువ సమయంలోనే పూర్తి చేశారని వ్యాఖ్యానించారు. దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు ప్రజలంతా సహకరించాలని షా పిలుపునిచ్చారు. 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను పూర్తిగా డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. నషా ముక్త్ భారత్ సాధనతోనే వికసిత్ భారత్ లక్ష్యం దిశగా ముందడుగు వేయగలమని అన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజం నిర్మూలన దిశగా దేశం పురోగతి సాధించిందని పేర్కొన్నారు. మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు షా చెప్పారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయిలో భారత్‌లో విలీనమైందని, నక్సలిజం నిర్మూలనకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు.

అబ్బే! యుద్ధానికి పెద్దగా ఖర్చేం కాలేదు

వెనిజులా నుంచి రాబట్టాం కదా : ట్రంప్

వాషింగ్టన్, అక్టోబరు 31: ఇరాన్ యుద్ధం వల్ల అమెరికాపై పెద్దగా ఆర్థిక భారమేమీ పడలేదనట్టుగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడారు. వెనుజులా నుంచి భారీగా ముడిచమురును రవాణా చేశామని, దానితో వచ్చిన ఆదాయంతో ఆ యుద్ధ ఖర్చు అంతా భర్తీ అయిందని అధ్యక్షుడు మీడియాకు వెల్లడించారు. అంతేగాక, ఇరాన్‌తో యుద్ధం ముగించడంలో తొందరేమీ లేదని వ్యాఖ్యానించారు. టెహ్రాన్‌పై మరోసారి దాడులు జరగొచ్చని సంకేతాలు వెలువడుతోన్న తరుణంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే వెనుజులా చమురు వల్ల ఎంతమేర ఆదాయం వచ్చిందో మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇక, ఈ యుద్ధంతో ఇప్పటివరకు అమెరికాకు సుమారు 47 బిలియన్ డాలర్ల ఖర్చు అయిందని అంచనా. మరోవైపు, అమెరికాతో చర్చలను ఇరాన్ కోరుకుంటోందని ట్రంప్ అన్నారు. ఆ దేశం అంతర్గతంగా ఎదుర్కొంటున్న సమస్యలే అందుకు కారణమని పేర్కొన్నారు. సైనికులు, పోలీసులకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలోకి టెహ్రాన్ వెళ్లిపోయిందన్నారు. ఇదిలా ఉండగా.. అమెరికా-ఇరాన్ మధ్య చర్చల కోసం ఒక తాత్కాలిక ముసాయిదా రూపొందించినట్లు తెలుస్తోంది. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం నిల్వలను మూడో దేశానికి తరలించడం లేదా దాని రేడియోధార్మికతను తగ్గించడం ఆ ముసాయిదా ప్రతిపాదనల్లో ఉంది. అలాగే ఈ చర్చల్లో భాగంగా ఒప్పందం కుదిరిన ఏడు రోజుల్లో హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవాలి. ఇరాన్ తన అణు కార్యక్రమాలపై, సముద్ర భద్రతపై చర్యలు తీసుకుంటే.. దానికి ప్రతిగా టెహ్రాన్‌పై విధించిన ఆంక్షలను, దిగ్బంధాలను అమెరికా సడలిస్తుందని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఈ ఒప్పందం అమలయ్యేందుకు చైనా ఒక హామీదారుగా ఉంటుందని తెలుస్తోంది. ఈ చర్చలు ఖతార్‌లో జరగనున్నాయి.



భారతీయ అమెరికన్లే లక్ష్యంగా డెమొక్రాట్ల ప్రచారం

న్యూయార్క్, అక్టోబరు 31: అమెరికాలో జరుగుతున్న మిడ్‌టర్మ్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు భారతీయ అమెరికన్ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా, దోసెలు వేయడం, ఆలయాలను సందర్శించడం, దీపావళి వేడుకల్లో పాల్గొనడం వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో వారిని ప్రసన్నం చేసుకుంటున్నారు. కొన్ని కీలక రాష్ట్రాల్లో ఈ వర్గం ఓట్లు గెలుపోటములను ప్రభావితం చేయగలవని గుర్తించడమే ఇందుకు ప్రధాన కారణం. ఇటీవల టెక్సాస్‌లో డెమొక్రాటిక్ సెనేట్ అభ్యర్థి జేమ్స్ టలారికో, భారతీయ ఓటర్ల కోసం స్వయంగా దోసె వేశారు. డల్లాస్ సమీపంలోని ఇర్వింగ్‌లో ఉన్న ఓ భారతీయ రెస్టారెంట్‌కు వెళ్లి, పెనంపై పిండి వేసి, ఆలూ కూరతో దోసె తయారు చేసి అరటి ఆకులో వడ్డించారు. ఒక సర్వే ప్రకారం, టెక్సాస్‌లోని సౌత్ ఏషియన్ ఓటర్లలో 66 శాతం మంది టలారికోకు మద్దతిస్తుండగా, ఆయన ప్రత్యర్థి, రిపబ్లికన్ కెన్ పాక్స్‌టన్‌కు కేవలం 21 శాతం మాత్రమే అనుకూలంగా ఉన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే తరహా ప్రచారం కనిపిస్తోంది. కనెక్టికట్ గవర్నర్ నెడ్ లమాంట్, ఓహియో కాంగ్రెస్‌మెన్ గ్రెగ్ ల్యాండ్స్‌మన్, న్యూజెర్సీ సెనేటర్ కోరీ బుకర్ వంటి ప్రముఖ నేతలు హిందూ ఆలయాలను సందర్శించడం, దీపావళి వేడుకల్లో పాల్గొనడం వంటి కార్యక్రమాల్లో మరుగ్గా కనిపించారు.

కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూజెర్సీ, జార్జియా, పెన్సిల్వేనియా వంటి రాష్ట్రాల్లో భారతీయఅమెరికన్ల జనాభా గణనీయంగా ఉంది. ముఖ్యంగా జార్జియా, పెన్సి ల్వేనియా, మిచిగాన్ వంటి హోరాహోరీ పోటీ ఉండే బ్యాటిల్‌గ్రౌండ్ రాష్ట్రాల్లో వీరి ఓట్లు అభ్య ర్థుల గెలుపోటములను శాసించే అవకాశం ఉంది.

రాబోయే ప్రధాని ఇక తమిళనాడునుంచే!

ఉపరాష్ట్రపతి సంచలన వ్యాఖ్యలు



మదురై, అక్టోబరు 31: భారతదేశానికి భవిష్యత్తులో తమిళనాడు నుంచి ప్రధానిమంత్రి వచ్చే అవకాశం ఉందని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. భారత ప్రజాస్వామ్యంలో ప్రతీ పౌరుడికి దేశాన్ని నడిపించే అవకాశం ఉంటుందని, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు ఇప్పటికే ప్రధానమంత్రి పదవిని చేపట్టారని ఆయన గుర్తుచేశారు. శుక్రవారం మదురైలో జరిగిన మీడియా సమావేశంలో అడిగిన ఓ ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ కర్ణాటక నుంచి వచ్చారని, ప్రస్తుత ప్రధాని మోడీ గుజరాత్ నుంచి వచ్చారని ఆయన అన్నారు. ఇప్పటి వరకు తమిళనాడు నుంచి ఒక్కరు కూడా ప్రధానమంత్రి కాలేదని, రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రాష్ట్రపతులుగా, మరో ముగ్గురు ఉప రాష్ట్రపతులుగా పనిచేశారని చెప్పారు. ప్రస్తుత ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ కూడా తమిళనాడుకు చెందినవారే. 1998 నుంచి 2004 వరకు కోయంబత్తూరు బీజేపీ ఎంపీగా కూడా పని చేశారు. తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌తో కలిసి ఉప రాష్ట్రపతి మదురైలోని మీనాక్షి సుందరేశ్వర ఆలయాన్ని సందర్శించారు. తర్వాత మదురైకి సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న పసుంపోన్‌లో స్వాతంత్ర్య సమర యోధుడు, ఆధ్యాత్మిక నాయకుడు ముత్తురామలింగ తేవర్ స్మారక స్థలాన్ని సందర్శించారు. ముత్తురామలింగ తేవర్‌ను నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ప్రధాన అను చరుడని రాధాకృష్ణన్ అభివర్ణించారు. తమిళ ప్రాంతంలో జాతీయ, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు.

ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఉన్నప్పటికీ ముత్తురామలింగ తేవర్ రాజకీయ ప్రయోజనాల కోసం తన సిద్ధాం తాలను, విలువలను ఎప్పుడూ రాజీపడలేదని తెలిపారు.

మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండేకు ఎసరు!

ఫడ్నవిస్‌ను కలిసిన థాకరే సోదరులు

ముంబయి, అక్టోబరు 31: మహారాష్ట్రలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అధికార మహాయుతి కూటమిలో చిచ్చు రేపాయి. బీజేపీపై అసంతృప్తిగా ఉన్న సంకీర్ణ భాగస్వామి, డిప్యూటీ సీఎం ఏక్ నాథ్ షిండే పార్టీ శివసేన సహకరించకపోవడంతో నాగ్ పూర్ సహా పలు చోట్ల కాషాయ పార్టీకి షాకులు తప్పలేదు. ఈ నేపథ్యంలో షిండేపై బీజేపీ ఆగ్రహంగా ఉంది. అదే సమయంలో షిండే కూడా ప్రభుత్వానికి గుడ్ బై చెప్పేయవచ్చన్న ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ రాజకీయ ప్రత్యర్థులైన థాక్రే సోదరులు ఉద్ధవ్, రాజ్ తో కలిసి ఓ వేదిక పంచుకోవడం చర్చనీయాంశమైంది. ఎమ్మెల్సీ ఎన్నికల సాక్షిగా మహాయుతి ప్రభుత్వంలో విభేదాలు బయటపడ్డాయి. ఎన్నికల్లో ఓటమి పాలైన బీజేపీ ఇందుకు శివసేనే కారణమని విమర్శలు గుప్పించగా ఇందులో తమ పాత్రేమీ లేదని షిండే వర్గం బదులిచ్చింది. ఈ నేపథ్యంలో ముంబైలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ సభకు సీఎం ఫడ్నవీస్ తో పాటు థాక్రే బ్రదర్స్ ఉద్ధవ్, రాజ్ హాజరు కావడంతో పాటు ఆయనతో చనువుగా, చర్చలు జరుపుతూ కనిపించారు. దీంతో ప్రభుత్వంలో మార్పులు జరగబోతున్నాయా అన్న చర్చ మొదలైంది.ఇందుకు ఊతమిచ్చేలా ఉద్ధవ్ పై సభలోనే ఫడ్నవీస్ సానుకూల వ్యాఖ్యలు చేశారు. ఉద్ధవ్‌తో తన పాత అనుబంధం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ 2019కి ముందు ఉద్ధవ్ తనకు ఫోన్ చేసినప్పుడల్లా స్పందించేవాడినని, కానీ ఆ తర్వాత ఆయన నుంచి పిలుపు కోసం ఎదురుచూస్తూనే ఉన్నానని చెప్పారు. 2019 వరకు ఉద్ధవ్ జీ నాకు ఫోన్ చేసినప్పుడల్లా నేను వెళ్లేవాడిని. 2019 తర్వాత ఆయన నాకు ఫోన్ చేయలేదు. నేను ఆయన పిలుపు కోసం ఎదురుచూస్తూనే ఉన్నానంటూ ఫడ్నవీస్ పేర్కొన్నారు. దీంతో ఈసారైనా ఉద్ధవ్ సీఎం ఫడ్నవీస్ ఫోన్ కు స్పందించి ఆయన వద్దకు వెళ్లారా లేదా అన్న చర్చ మొదలైంది. అయితే ఈ ప్రచారాల్ని థాక్రే బ్రదర్స్ లైట్ తీసుకుంటున్నారు. ఇది పార్టీలకతీతంగా నేతలు వ్యవహరించాల్సిన సందర్భం మాత్రమేనని వారు చెప్తున్నారు. రాబోయే రోజుల్లో దీనిపై క్లారిటీ రానుంది.

భారత ఎయిర్ చీఫ్ మార్షల్‌గా అశుతోష్ దీక్షిత్



న్యూఢిల్లీ, అక్టోబరు 31: భారత వాయుసేన ఉన్నతస్థాయి నాయకత్వం లో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. భారత వైమానిక దళ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీక రించారు. ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శనివారం పదవీ విరమణ చేయగా, దీక్షిత్ బాధ్య తలు చేపట్టారు. దాదాపు 20 రకాల యుద్ధ విమానాలను నడిపిన అనుభవం ఉన్న అశుతోష్ దీక్షిత్ 2028 డిసెంబర్ 31 వరకు ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. వ్యూహాత్మక ప్రణాళికల్లో పేరొందిన ఆయన ఆపరేషన్ సింధూర్ సమయంలో కీలకపాత్ర పోషించారు. ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ 1966 డిసెంబర్ 9న జన్మించారు. 1986 డిసెంబర్ 6న వాయుసేనలో చేరారు. నాలుగు దశాబ్దాల కాలంలో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. మిరాజ్ 2000, కిరణ్, మిగ్, జాగ్వార్, తేజస్ వంటి యుద్ధ విమానాల్లో 3,500 గంటలకు పైగా విమానయానం చేసిన అనుభవం ఉంది. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ సిందూర్ వంటి అనేక కీలక ఆపరేషన్‌లలో పనిచేశారు.

బాలీవుడ్ దర్శకనిర్మాత సంజయ్‌గుప్తా కన్నుమూత



ముంబయి, అక్టోబరు 31: ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్ గుప్తా (59) కన్నుమూశారు. ఈనెల 30న రాత్రి బాత్‌రూమ్‌లో జారిపడటంతో ఆయన తలకు తీవ్ర గాయమై మృతి చెందినట్లు ఇండస్ట్రీ వర్గాలు తెలిపాయి. దర్శకుడు అశోక్ పండిట్ కూడా సంజయ్ గుప్తా మరణవార్తను ధ్రువీకరించారు. ఇంట్లో తలకు గాయమవడంతో ఆయన మృతి చెందారని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. సంజయ్ గుప్తా మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని సంతాపం తెలిపారు. 1994లో ఆదిత్య పంచోలీ, సంజయ్ దత్ ప్రధాన పాత్రల్లో నటించిన ఆతిష్ ఫీల్ ద ఫైర్ సినిమాతో సంజయ్ గుప్తా సినీ రంగంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత రామ్ శాస్త్ర, ఖౌఫ్, జంగ్ చిత్రాలకు దర్శకత్వం వహించడంతో పాటు రచయితగా, నిర్మాతగానూ వ్యవహరించారు. కాంటే, కాబిల్, షూటౌట్ ఎట్ వడాలా వంటి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

సంజయ్ దత్‌తో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉండేది. వీరిద్దరి కలయికలో కాంటే, ముసాఫిర్, జిందా, షూటౌట్ ఎట్ లోఖండ్‌వాలా వంటి చిత్రాలు వచ్చాయి. జిందా దక్షిణ కొరియా సినిమా ఓల్డ్‌బాయ్‌కు అనధికారిక రీమేక్. షూటౌట్ ఎట్ లోఖండ్‌వాలా, దస్ కహానియాన్ చిత్రాలను నిర్మించిన ఆయన షూటౌట్ ఎట్ వడాలాకు దర్శకత్వం వహించి సహ నిర్మాతగానూ వ్యవహరించారు. ఆయన చివరి చిత్రం ది మిరాండా బ్రదర్స్ 2025లో విడుదలైంది.

ముంబయిని ఏలాలన్న లక్ష్యంతోనే బిష్ణోయ్ గ్యాంగ్ దూకుడు

ముంబయి, అక్టోబరు 31: దేశ ఆర్థిక రాజధానిలో మళ్లీ అండర్‌వరల్డ్ ఆధిపత్య పోరు మొదలైందా బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల ఘటనపై దర్యాప్తు చేస్తున్న పోలీసులకు కీలక వివరాలు లభించినట్లు తెలుస్తోంది. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ముంబైలో తన పట్టును పెంచుకునేందుకు, ఒకప్పుడు దావూద్ ఇబ్రహీం గ్యాంగ్ సృష్టించిన భయాన్ని మళ్లీ నెలకొల్పాలని ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ముంబైలో ఏకఛ్ఛత్రాధి పత్యం సాధించడమే బిష్ణోయ్ గ్యాంగ్ లక్ష్యంగా కనిపిస్తోందని పోలీసు వర్గాలు తెలిపాయి.

దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగులోకి

1990లలో అండర్‌వరల్డ్ ముఠాల పేరు చెబితేనే వ్యాపారవేత్తలు, బిల్డర్లు, సినీ ప్రముఖులు భయపడేవారు. అలాంటి పరిస్థితులను మళ్లీ సృష్టించాలని గ్యాంగ్ భావిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ భయాన్ని ఆసరాగా చేసుకుని భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని చూస్తున్నట్లు భావిస్తున్నారు. టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల ఘటనకు సంబంధించి ఇప్పటివరకు 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పలు కీలక ఆడియో క్లిప్పులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఒకప్పటి దినసరి కూలీ నేడు చైనాలోనే సంపన్న మహిళ!



బీజింగ్, అక్టోబరు 31: జీవితంలో కష్టపడితే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తూ, ఒకప్పుడు ఫ్యాక్టరీలో సాధారణ కార్మికురాలిగా పనిచేసిన మహిళ ఇప్పుడు చైనాలోనే అత్యంత ధనిక వ్యక్తిగా అవతరించారు. పేదరికం నుంచి అపార సంపదను సృష్టించిన ఆమె పేరు ఝౌ క్యున్‌ఫెయ్ (56). గ్లాస్ తయారీ దిగ్గజం లెన్స్ టెక్నాలజీ వ్యవస్థాపకురాలైన ఆమె, తన స్ఫూర్తిదాయక ప్రస్థానంతో మరోసారి వార్తల్లో నిలిచారు. అక్టోబర్ 28న విడుదలైన హురున్ రిచెస్ట్ ఉమెన్ ఇన్ చైనా 2026 జాబితా ప్రకారం ఝౌ క్యున్‌ఫెయ్ చైనాలో అత్యంత సంపన్న మహిళగా తిరిగి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఆమె సంపద 15 పెరిగి 127 బిలియన్ యువాన్లకు (సుమారు రూ.1,80,692 కోట్లు) చేరింది. హన్‌సో ఫార్మాస్యూటికల్ వ్యవస్థాపకురాలు ఝోంగ్ హుయిజువాన్ (124 బిలియన్ యువాన్లు) రెండో స్థానంలో నిలిచారు. గతంలో 2015లో కూడా ఝౌ ఈ ఘనతను సాధించారు. ది ఇండిపెండెంట్ కథనం ప్రకారం ఝౌ క్యున్‌ఫెయ్ జీవితం అనేక మలుపులతో సాగింది. 1970లో హునాన్‌లో జన్మించిన ఆమె, టీనేజి వయసులో చదువు మధ్యలో ఆపేసి షెన్‌జెన్‌కు వలస వెళ్లారు. అక్కడ ఒక వాచ్‌గ్లాస్ ఫ్యాక్టరీలో రోజుకు కేవలం 1.20 డాలర్ల (సుమారు రూ.114) వేతనానికి పనిచేశారు. 23 ఏళ్ల వయసులో సొంతంగా ఒక గ్లాస్‌ప్రాసెసింగ్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. అక్కడే ఆధునిక తయారీ పద్ధతులను స్వయంగా నేర్చుకున్నారు. ఆ తర్వాత ఆమె స్థాపించిన లెన్స్ టెక్నాలజీకి 2007లో లభించిన ఒక ఒప్పందం ఆమె తలరాతనే మార్చేసింది. యాపిల్ మొదటి తరం ఐఫోన్ల కోసం గ్లాస్ స్క్రీన్లను సరఫరా చేసే కాంట్రాక్టును లెన్స్ టెక్నాలజీ దక్కించుకుంది. అప్పటి నుంచి కంపెనీ వేగంగా అభివృద్ధి చెంది, స్మార్ట్‌ఫోన్ గ్లాస్ స్క్రీన్ల తయారీలో అగ్రగామిగా నిలిచింది.

నెలకు పదివేల జీతగాడి ఖాతాలో పదివేల కోట్లు!



జైపూర్, అక్టోబరు 31: రాజస్థాన్‌లో ఓ యువకుడికి ఊహించని షాక్ తగిలింది. నెలకి పది వేల రూపాయల జీతం తీసుకునే అతని అకౌంట్‌లో ఏకంగా రూ. 10,000 కోట్లు వచ్చి పడ్డాయి. అయితే, ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. బ్యాంకు ఆ ఖాతాను వెంటనే స్తంభింపజేయడంతో తన సొంత డబ్బులు కూడా వాడుకోలేని పరిస్థితి ఎదురైంది. సికార్‌లోని సలాసర్ బస్ స్టాండ్ సమీపంలో ఉన్న నిర్మల్ మెడికల్ పాయింట్‌లో సమీర్ ఖాన్ (22) అనే యువకుడు పనిచేస్తున్నాడు. బుధవారం తన ఫోన్ రీఛార్జ్ చేసుకునేందుకు బ్యాంకింగ్ యాప్ తెరిచాడు. బ్యాలెన్స్ సున్నా చూపించడంతో కంగారుపడి వివరాలు చెక్ చేయగా, తన ఖాతాలో రూ. 10,000 కోట్లకు పైగా మొత్తాన్ని బ్యాంకు నిలిపివేసినట్టు గుర్తించాడు. దీంతో అకౌంట్‌లోని తన సొంత డబ్బు రూ. 55,000 కూడా ఫ్రీజ్ అయిపోయింది. వెంటనే ఈ విషయాన్ని తన యజమాని ధీరజ్ శర్మకు చెప్పి, ఇద్దరూ కలిసి సైబర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.

పోలీసుల సూచనతో బ్యాంకు అధికారులను సంప్రదించగా, సాంకేతిక లోపం వల్లే ఇలా జరిగిందని వారు తెలిపారు. నా అకౌంట్‌లో రూ. 55,000 ఉండగా, రూ. 10,000 కోట్ల లీన్ విధించారు. నా డబ్బులు కూడా వాడుకోలేకపోయాను. పోలీసులకు, బ్యాంకుకు చెప్పడంతో సమస్య పరిష్కారమైందని సమీర్ ఖాన్ చెప్పాడు. అనంతరం బ్యాంకు ఆ సాంకేతిక లోపాన్ని సరిచేసి, సమీర్ అసలు బ్యాలెన్స్‌ను పునరుద్ధరించడంతో ఈ గందరగోళానికి తెరపడింది.

సంక్షిప్త వార్తలు

జమ్ము కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా రెండో పెళ్లి

శ్రీనగర్, అక్టోబరు 31: జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా రెండో వివాహం చేసుకున్నారు. ప్రముఖ జర్నలిస్టు నిధి రజ్దాన్‌ను పెళ్లి చేసుకున్నట్లు శనివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు పెళ్లి జరిగిన మరుసటి రోజే నిధి రజ్దాన్‌తో కలిసి దిగిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. తమ జీవితంలో కొత్త అధ్యాయం మొదలైందని అన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో నిధిరజ్దాన్‌ను ట్యాగ్ చేస్తూ ఒమర్ అబ్దుల్లా ఓ ఫొటోను పోస్టు చేశారు. 'నిన్న ఒక కొత్త ప్రయాణం ప్రారంభమైంది' అంటూ క్యాప్షన్ ఇచ్చారు.



కిండర్‌గార్డెన్ విద్యార్థినిపై మూడో తరగతి బాలుడి దాడి

పంచ్‌కుల, అక్టోబరు 31: పంచ్‌కులాలోని ఓ పాఠశాలలో అత్యంత దారుణమైన సంఘటన చోటుచేసుకుంది. మూడో తరగతి చదువుతున్న ఓ బాలుడు, ప్రత్యేక అవసరాలున్న కిండర్ గార్టెన్ (కేజీ) విద్యార్థినిపై రాళ్లు, పూలకుండీతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటన పంచ్‌కులా సెక్టార్ 20లోని సంస్కృతి మోడల్ స్కూల్‌లో జరిగింది. మూడో తరగతి చదువుతున్న బాలుడు చిన్నారిపై మొదట రాళ్లతో పదేపదే దాడి చేశాడు. ఆ తర్వాత అక్కడే ఉన్న పూల కుండీతో బలంగా కొట్టాడు. ఈ దాడిలో బాలిక స్పృహ కోల్పోయినా కూడా ఆ బాలుడు దాడి ఆపలేదని, స్పృహతప్పిన చిన్నారిని కొంత దూరం లాక్కెళ్లినట్లు సమాచారం.

కాంగ్రెస్‌నేత కృపా ఆల్వాపై బహిష్కరణ వేటు!



బెంగళూరు, అక్టోబరు 31: కర్ణాటక కాంగ్రెస్‌లో స్టింగ్ ఆపరేషన్ వ్యవహారం కలకలం రేపుతోంది. ఆ పార్టీ నేత, మాజీ ప్రధాన కార్యదర్శి కృపా ఆల్వాపై కాంగ్రెస్ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఆమెను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరించింది.



శనివారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో నిర్వహించిన 26వ తెలంగాణ వేద విద్వన్మహాసభలో ప్రసంగిస్తున్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

భారతీయ సంస్కృతికి వేదాలే ప్రాణం

గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

పదిమంది విద్వాంసులకు సత్కారం

యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త: వేదాలే భారతీయ నాగరికతకు, సంస్కృతికి మూలాధారమని గవర్నర్ శివప్రతాప్‌శుక్లా అన్నారు. వేద జ్ఞానం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా ప్రకృతి పరిరక్షణ, నైతిక విలువలు, మానవ జీవనం, సామాజిక సామరస్యానికి మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో శనివారం నిర్వహించిన 26వ తెలంగాణ వేద విద్వన్మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. వేదాలను శుద్ధ ఉచ్చారణ, స్వర, పాఠ సంప్రదాయాలతో తరతరాలకు అందిస్తున్న గురుశిష్య పరంపర సేవలు అమూల్యమని గవర్నర్ కొనియాడారు. మహాసభల్లో నిర్వహించిన వేద పరీక్షలకు హాజరైన 500 మందికిపైగా విద్యార్థులను అభినందించారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన పదిమంది వేద విద్వాంసులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. వేద విద్యాసంస్థలు, గురుకులాలకు ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ వేద సంస్కృతి పరిరక్షణకు కృషి చేస్తున్న సాయినాథ్‌శర్మ సేవలను ప్రశంసించారు. వేద విద్యను అభ్యసించే విద్యార్థుల సంఖ్య పెరగాలని, పిల్లలను వేద విద్యవైపు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రుల కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ వేదపఠనం జ్ఞానం, ఏకాగ్రతను పెంపొందిస్తుందని, భారతీయ సంస్కృతిని భావితరాలకు అందించడంలో వేద విద్య కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధానకార్యదర్శి దానకిశోర్, ధార్మిక సలహాదారు ఆర్.గోవింద్ హరి, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంశ్ యాదవ్, దేవస్థానం కార్య నిర్వహణాధికారి జె. భవానీ శంకర్, ట్రస్ట్ చైర్మన్ సాయినాథ్‌శర్మ, వేద పండితులు, ఆచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.42.5 లక్షల సిఎస్ఆర్ నిధులు

హైదరాబాద్,అక్టోబరు31,ప్రభాతవార్త: పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైపిఎస్)కు మూడు కార్పొరేట్ సంస్థలు రూ.42.5 లక్షల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను విరాళంగా అందించాయి. కోహినూర్ గ్రూపుకు చెందిన ఏక్యూ స్క్వేర్ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.25 లక్షలు విరాళంగా అందించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అహ్మద్ ఖాద్రీ తరఫున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహమ్మద్ అమ్జద్, ఆయన కుమారుడు మహమ్మద్ నిసార్ ఖాద్రీ ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును డిజిపి సి.వి. ఆనంద్‌కు అందజేశారు. అలాగే పుజ్జోలానా మెషినరీ ఫ్యాబ్రికేషన్స్ ఎల్ఎల్పీ, ఆర్యన్ ప్రెసిషన్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున మేనేజింగ్ డైరెక్టర్ ఆదిత్య పాయ్ రూ.10 లక్షలు అందించారు. దీవ్యశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపక డైరెక్టర్ రవీంద్ర కుమార్ అగర్వాల్ రూ.7.5 లక్షల విరాళాన్ని అందజేశారు. పోలీసు సిబ్బంది సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ, వారి పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఈ విరాళాలు అందించినట్లు సంస్థల ప్రతినిధులు తెలిపారు. విద్యాభివృద్ధికి ఉదారంగా సహకరించిన సంస్థల ప్రతినిధులను డిజిపి సివి ఆనంద్ అభినందించారు.



రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో శనివారం డిజిపి కార్యాలయంలో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐజి గజరావు భూపాల్

జాతీయ సమైక్యతే లక్ష్యంగా ముందుకు సాగాలి

డిజిపి కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివస్

హైదరాబాద్,అక్టోబరు31,ప్రభాతవార్త: సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) కార్యక్రమాన్ని శనివారం డీజీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ (పిఅండ్ఎల్) గజరావు భూపాల్ పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. మల్టీ జోన్-1 ఐజీ చంద్ర శేఖర్‌రెడ్డి దేశ సమైక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం సంస్థానాల విలీనంలో కీలక పాత్ర పోషించి దేశ ఐక్యతకు బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐజీ (పిఎల్) గజరావు భూపాల్, మల్టీ జోన్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డితో పాటుగా ఏఐజీ (అడ్మిన్) అన్యోన్య, పలువురు పోలీసు అధికారులు, సీఏవోలు, ఏవోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలి

రైతు కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త: ఎల్‌నినో, ప్రతికూల వాతావరణం నేపథ్యంలో రాష్ట్రంలో పంటలు దెబ్బతిని తీవ్ర కష్టాల్లో ఉన్న రైతాంగానికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని రైతు కమిషన్ రాష్ట్ర అధ్యక్షులు కోదండరెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ ఎల్ నినో రాకముందే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాంప్రదాయ పంటలకు బదులుగా ప్రత్యామ్నాయంగా పంటల మార్పిడికి సంబంధించిన నివేదికను సమర్పించినట్లు తెలిపారు. వర్షాభావం, ప్రత్యామ్నాయ పంటల విషయమై వైఎస్ హయాంలో పనిచేసిన వ్యవసాయ ఉన్నతాధికారులను సంప్రదించి వివరాలు సేకరించినట్లు వెల్లడించారు. తెలంగాణలో గొలుసు కట్టు చెరువులు నిరక్ష్యం చేయబడ్డాయని, దానిపై కూడా రైతు కమిషన్ ఓ నివేదిక రూపొందించి నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలో చెరువుల పునరుద్ధరణ, సాగు నీటి వనరుల రక్షణ గూర్చి చేపట్టాల్సిన చర్యలపై నివేదికలో రూపొందించినట్లు చెప్పారు. అలాగే రాష్ట్రంలో వ్యవసాయ పంటలపై ఎల్ నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలు, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల విషయమై రైతులను చైతన్య, అవగాహన కలిగించేలా రైతు కమిషన్ ఆధ్వర్యంలో కరపత్రాలు రూపొందించినట్లు వివరించారు. కాగా ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన పనిచేసి వారి సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

ఉద్యాన పంటలపై ఎల్‌నినో పడగ

కరెంటు కోతలు, తగ్గిన నీటి మట్టాలు

ఎండిపోతున్న కూరగాయలు, ఆకుకూరల తోటలు

పశువులకు మేతగా వదిలేస్తున్న పాలాలు

ప్రత్యామ్నాయ పంటలు వేసినా రైతులకు తప్పని నష్టాలు

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త: ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులు తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచాయి. దీనికి తగినట్లుగా కరెంటు కోతలు, ప్రాజెక్టుల నుండి నీరు రాకపోవడం, భూగర్భ జల మట్టాలు పడిపోవడం వంటి కారణాలు రాష్ట్రంలోని రైతాంగానికి పెనుకష్టాలు, నష్టాలను మిగిల్చుతున్నాయి. పచ్చని పంటలతో కళకళలాడాల్సిన పంటలు, కూరగాయల తోటలు ఎండిపోయి రైతులను అప్పుల పాల్జేస్తున్నాయి. రాష్ట్రంలో జూన్ నుండి ఇప్పటి వరకూ (శనివారం) సాధారణ వర్షపాతం 830.7 మిల్లీ మీటర్లు కాగా, 623.1 మిల్లీ మీటర్లు నమోదైంది. నెలల వారీగా చూస్తే జూన్‌లో 12, జూలై 1 శాతం, అగస్టులో 38 శాతం, సెప్టెంబరులో 15 శాతం, ఈ నెలలో 91 శాతం లోటు వర్షపాతం నమోదైంది. మరోవైపు రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, మరోవైపు పడిపోతున్న భూగర్భజలాలు, ఇంకోవైపు కరెంటు కోతలతో చేతికొచ్చే దశలో ఎండిపోతున్న కూరగాయలు, ఆకుకూరల తోటలు దెబ్బతింటున్నాయి. ఒకప్పుడు తెలంగాణలో 5.52 లక్షల ఎకరాల్లో పండిన కూరగాయలు ప్రస్తుతం 45 వేల ఎరాలకు పడిపోయింది. దీనికి తగినట్లుగా హార్టికల్చర్‌కు కేంద్రంగా ఉండే హైదరాబాద్ చుట్టుపక్కల గ్రామాలు ఇప్పుడు రియల్ ఎస్టేట్ విస్తరణతో చిక్కుడు, టమాటా, బీన్స్, క్యాబేజీ, వంగ, బెండ, కంద లాంటి కూరగాయల సాగు క్రమంగా తగ్గిపోయింది, దీనికి తోడు ఇప్పుడు ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల్లో అంతంత మాత్రంగా వేసిన కూరగాయలు, ఆకుకూరల తోటలు ఎండిపోతున్నాయి.

వర్షాలు సరిగ్గా పడకపోవడంతో పత్తి, మిరప జోలికి వెళ్తే రిస్క్ ఎక్కువని రైతులు భావించారు. ఎక్కువ వాటర్ అవసరం అయ్యే పంటల జోలికి వెళ్లొద్దని ప్రభుత్వం కూడా పదే పదే చెప్పింది. దీంతో తక్కువ నీటితో, తక్కువ సమయంలో చేతికొచ్చే బెండ, టమాటా, దోస, చిక్కుడు, వంకాయ, బీర, సొరకాయ తదితర కూరగాయలు, ఆకు కూరల సాగు వైపు మొగ్గు చూపారు. అప్పులు చేసి మరీ వేలల్లో పెట్టుబడి పెట్టారు. అయితే ప్రభుత్వం ఊహించిన దాని కంటే దారుణంగా ఉండి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో భూగర్భ జలాలు, ప్రధాన జలాశయాలు, నీటి వనరులు, చెరువులన్నీ అడుగంటిపోయి జలకళ తప్పి కరవు ఛాయలు కమ్ముకున్నాయి. పోనీ బోర్ల వైపు చూస్తే భూగర్భ జలాల లెవల్స్ డేంజర్ జోన్‌కు పడిపోయాయి. నీటి ఎద్దడి ఒకవైపు అయితే, విద్యుత్ కోతలు మరోవైపు రైతుల నడుం విరుస్తున్నాయి. కొద్దో గొప్పో ఉన్న పాతాళ గంగను తోడుకుందామన్నా కరెంట్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కూరగాయలు పూతకు వచ్చే కీలక దశలో సరిపడా నీరు అందక పంట తోటలు కళ్లముందే ఎండిపోతున్నాయి. ప్రధాన ఆహార పంటలతో పాటు, ప్రస్తుతం చేతికొచ్చే దశలో కూరగాయలు, ఆకుకూరల పైర్లు ఎండిపోతుండటం రైతుల్లో కలవరం కలిగిస్తోంది. వర్షాభావంతో చిక్కుడు పంటలు ఎండిపోతుండగా ఇక ఆశలు పూర్తిగా వదిలేసుకున్న కొందరు రైతులు ఎండిపోయిన పంటలను గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలకు మేతగా అందిస్తున్నారు. రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి వంటి ఉమ్మడి జిల్లాల్లో కూరగాయల తోటలు రక్షించుకునేందుకు రైతులు ట్యాంకర్ల సాయంతో నీరు పెట్టుకుంటున్నారు. ఆర్థిక భారమైనా కూడా ఒక్కో ట్యాంకరు 500 నుంచి 800 రూపాయల చొప్పున చెల్లించి పంటలకు నీరు అందిస్తున్నారు. దీంతో పెట్టుబడి పెట్ట లేక పలువురు రైతులు ఎండిపోతున్న పంటలను పశువులకు మేతగా వదలివేస్తున్నారు.

ఇందిరకు ఘనంగా నేతల నివాళులు

నెక్లెస్‌రోడ్‌లో విగ్రహానికి పూలమాల వేసిన వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త: ఇందిరా గాంధీ 42వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా ఘన నివాళులు అర్పించారు. ఇందిరా గాంధీ 20 సూత్రాల పథకం, బ్యాంకుల జాతీయీకరణ, గరీబీ హఠావో వంటి కార్య క్రమాలతో దేశ అభివృద్ధికి తీసుకొన్న వినూత్న విప్లవాత్మక కార్యక్రమా లతోపాటు పాకిస్థాన్‌ను రెండు దేశాలుగా చీల్చిన వీరోచిత పోరాటాన్ని మననం చేసుకొని ఆమె ధైర్యసాహసాలను ఆత్మావలోకనం చేసుకొన్నారు. రాష్ట్ర రాజధానికి హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నెక్లెస్ రోడ్డు వద్ద ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలను, దేశ సమగ్రత, సమైక్యత కోసం ఆమె చేసిన కృషిని వారు స్మరిం చుకున్నారు. భారతదేశ తొలి మహిళా ప్రధానిగా దేశ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ ఐక్యత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఇందిరాగాంధీ చూపిన నాయకత్వం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

గాంధీభవన్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీ, పిసిసి ఉపాధ్యక్షులు కుమార్‌రావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, మెంబెర్ భవానిరెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.

మధుయాష్కీ ఈ సంద ర్భంగా మాట్లాడుతూ అక్టోబరు 31 దేశ చరిత్రలో నిలిచిపోయే రోజని, దేశం సమగ్రత కోసం ఇందిరాగాంధీ ప్రాణత్యాగం చేశారని ఆయన ఆవేదన చెందారు. దేశ నిర్మాణంలో ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ దేశ చరిత్రలో మహానేతగా గుర్తింపు పొందారనీ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ బాటలో పాలన సాగిస్తోందనీ చెప్పారు. పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పని చేస్తోందనీ అన్నారు. జాతీయ నేతలను స్మరించుకోవడంలోనూ బిజెపి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

చరిత్రలో మహనీయుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని మహా నేతలని స్మరించుకోవడంలో బిజెపి రాజకీయం చేస్తుందనీ ఆవేదన చెందారు. జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళులు అర్పించారు.



ఓటుహక్కు హరించే కుట్ర భగ్నానికి హస్తిన బాటపట్టిన భారతీయులు

చలో ఢిల్లీకి తెలంగాణలో భారీగా ప్రజాదరణ

రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త: ఓటు హక్కును హరించే కుట్రను అడ్డుకోవడానికి రాహుల్ గాంధీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా భారతీయులు హస్తిబాట పట్టారని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని, దేశంలో ఓటర్ల హక్కులను పరి రక్షించాలని రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశ రాజధాని ఢిల్లీలో చేపట్టిన చలో ఢిల్లీ నిరసన కార్యక్రమానికి దేశవ్యాప్తంగా భారీ స్పందన లభిస్తోందని, ప్రజా స్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలనే సంకల్పంతో దేశ నలుమూలల నుంచి ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి తరలివస్తున్నారని తెలిపారు. బిజెపి ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకుని సిబిఐ, ఇడి వంటి దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాలపై రాజకీయ కక్ష సాధింపు కోసం ఉపయోగిస్తోందని విమర్శించారు. ప్రతి భారతీయ పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఆ హక్కును బలహీనపరిచే లేదా హరించే ఎలాంటి కుట్రలనైనా సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో మరో సత్యాగ్రహ పోరాటం చేస్తున్నారని వర్ణించారు. ఇది కేవలం ఒక రాజకీయ పార్టీ పోరాటం కాదని, దేశ భవిష్యత్తును, పౌరుల హక్కులను కాపాడే ప్రతి ఒక్కరి పోరాటమని పేర్కొన్నారు.ప్రజల వెల్లువను చూసి కేంద్రం భయ పడుతోందనీ ఎద్దేవా చేశారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే నిర సన కార్యక్రమానికి తరలిరావాలని రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపుతో దేశవ్యాప్తంగా ప్రజలు ఢిల్లీ బాట పట్టారని మంత్రి తెలిపారు. ఈ ప్రజా ఉద్యమానికి వస్తున్న స్పందనను చూసి భయపడిన కేంద్ర ప్రభుత్వం, నిరసనకారులు ఢిల్లీ చేరకుండా రవాణా సదుపాయాలకు ఆటంకాలు కల్పిస్తూ, నిర్బంధాలకు పాల్పడుతోందని విమర్శించారు.

ఈగల్ ఫోర్స్, కోదాడ టౌన్ పోలీసుల ఉమ్మడి ఆపరేషన్

రూ.75 లక్షల విలువైన 150 కిలోల గంజాయి స్వాధీనం

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త:రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిరోధానికి కఠిన చర్యలు చేపడుతున్న తెలంగాణ ఈగిల్ ఫోర్స్ మరో భారీ అంతర్రాష్ట్ర గంజాయి ముఠా గుట్టు రట్టు చేసింది. కోదాడ టౌన్ పోలీసులతో కలిసి శనివారం నిర్వహించిన ఉమ్మడి ఆపరేషన్లో సుమారు 150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, రవాణా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేశారు. ఒడిశా నుంచి కర్ణాటకకు హోండా సిటీ కారులో గంజాయిని తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో కోదాడ హైవేలోని కాకతీయ సేవా సమితి సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కారును నిలిపి తనిఖీ చేయగా, 62 ప్యాకెట్లలో ప్యాక్ చేసిన రూ.75 లక్షల విలువైన 150 కిలోల గంజాయి బయటపడింది. ఈ ఆపరేషన్లో పట్టుబడిన నిందితులను కర్ణాటక చామరాజనగర్ జిల్లాకు చెందిన సెల్వ సూర్య (26) రాజా గౌండర్ మురుగన్ (42) లుగా పోలీసులు గుర్తించారు. ఒడిశాలోని చిత్రకొండకు చెందిన రాజు అనే వ్యక్తి నుంచి ఈ గంజాయిని కొనుగోలు చేసి, కర్ణాటకకు తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు.

ఈ రవాణా కోసం గంజాయిని స్వీకరించే వ్యక్తులే కారును ఏర్పాటు చేశారని, కేవలం డెలివరీ చేసినందుకు తమకు రూ.20,000 ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నట్లు విచారణలో తేలింది. ఈ గంజాయి రవాణా వెనుక కర్ణాటకలోని హానూరుకు చెందిన ఈశ్వర్ గౌండర్ (40), శివప్ప అనే ఇద్దరు కీలక వ్యక్తులు గంజాయి రిసీవర్లుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఒడిశాలో సరఫరా చేసిన రాజుతో పాటు కర్ణాటకలో తీసుకోబోతున్న రిసీవర్ల పాత్రపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ నెట్వర్క్‌లో మరికొంతమంది వ్యక్తులు లేదా ఆర్గనైజ్డ్ గ్యాంగ్ల ఉన్నాయా అనే కోణంలో సిట్ పోలీస్ బృందాలు దర్యాప్తును వేగవంతం చేశాయి. స్వాధీనం చేసుకున్న 150 కిలోల గంజాయి, హోండా సిటీ కారుతో పాటు అదుపులోకి తీసుకున్న ఇద్దరు నిందితులను కోదాడ టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

పోలీసు శాఖలో చేను మేసిన కంచె

స్వాధీనం చేసుకున్న బంగారాన్ని తాకట్టు పెట్టిన కానిస్టేబుల్

సెల్‌ఫోన్ ద్వారా అక్రమంగా నగదును బదలీ చేయించుకున్న ఘనుడు

కేసు నమోదు చేసి కటకటాలకు పంపిన పోలీసు అధికారులు

హైదరాబాద్ (సరూర్‌నగర్), అక్టోబరు 31, ప్రభాతవార్త: కంచే చేను మేసిందనే సామెతను అక్షరాలా నిరూపిస్తున్న సంఘటన ఇది. ఓ కానిస్టేబుల్ చేసిన నిర్వాకం పోలీసు శాఖనే అప్రదిష్ట పాలు చేసిన ఉదంతమిది. ఓ కేసులో విచారణ నిమిత్తం స్వాధీనం చేసుకున్న బంగారాన్ని తాకట్టు పెట్టి లక్షలాది రూపాయలు తీసుకోవడమే కాకుండా సెల్‌ఫోన్ నుండి యుపిఐ ద్వారా నగదును అక్రమంగా బదిలీ చేసుకున్న కానిస్టేబుల్ పోలీసు శాఖకు మాయని మచ్చను తెచ్చారు. చేసిన ఘరానా కార్యం ఎట్టకేలకు బట్టబయలు కావడంతో సదరు కానిస్టేబుల్ శ్రవణ్‌కుమార్ ఊచలు లెక్కించాల్సి వచ్చింది. నిందితునిగా మారిన కానిస్టేబుల్‌పై అతను పని చేస్తున్న పోలీస్ స్టేషన్‌లోనే కేసు నమోదై రిమాండ్‌కు పంపారు. బంగారాన్ని తాకట్టు పెట్టడం ద్వారా వచ్చిన డబ్బును అదే విధంగా సెల్‌ఫోన్ నుండి బదలీ చేయించుకున్న నగదును తండ్రి వైద్యం కోసం చేసిన అప్పులను తీర్చడానికి, వ్యక్తిగత అవసరాల కోసం వాడుకున్నట్లు సదరు పోలీసు కానిస్టేబుల్ విచారణలో వెల్లడించడం గమనార్హం. పోలీసు శాఖలోనే తీవ్ర కలకలం, చర్చనీయాంశమైన ఈ ఘటన హైదరాబాద్ కమీషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ పిఎస్‌లో జరిగింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి.

గత జూలై నెల 30వ తేదీన మీర్‌పేట్ పిఎస్ పరిధిలోని అల్మాస్‌గూడ వినాయకహిల్స్‌కు చెందిన హేమ అనే వివాహిత ఆత్మహత్య చేసుకోగా అదనపు కట్నం, వేధింపుల వల్లే అంటూ ఆమె పుట్టింటి వారు చేసిన ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త రాజ్‌కుమార్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదైంది. దీంతో భర్త రాజ్‌కుమార్ రిమాండ్ కాగా కేసు విచారణ నిమిత్తం నిందితుడి ఇంట్లోని బంగారాన్ని అదే విధంగా సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే స్టేషన్ లాకర్‌లో భద్రపరచాల్సిన బంగారంపై కన్నేసిన కానిస్టేబుల్ శ్రవణ్‌కుమార్ దానిని చాటుగా తీసుకొని రూ.12.37 లక్షలకు తాకట్టు పెట్టి సొమ్ము తీసుకున్నాడు. అదే విధంగా సెల్‌ఫోన్ నుండి యుపిఐ ద్వారా 1.37 వేల నగదును తన భార్యకు బదిలీ చేసుకున్నాడు. అంతే కాకుండా మరో 33 వేల రూపాయలను శివాజీ పేరున్న వ్యక్తికి అక్రమంగా బదిలీ చేశాడు. ఇదిలా ఉండగా బెయిల్‌పై జైలు నుండి బయటకు వచ్చిన రాజ్‌కుమార్ నగదు అవసరాల నిమిత్తం బ్యాంకు నుండి డ్రా చేసుకోవడానికి వెళ్తే అక్కడ డబ్బులు లేవన్నట్లు తెలుసుకొని నిర్ఘాంతపోయాడు. తర్వాత స్టేషన్‌కు వచ్చి విచారించగా సదరు కానిస్టేబుల్ శ్రవణ్‌కుమార్ సెల్‌ఫోన్ ద్వారా డబ్బులతో పాటు స్వాధీనం చేసుకున్న బంగారాన్ని సైతం తాకట్టు పెట్టి నగదు తీసుకున్నట్లు తెలుసుకున్నాడు. ఈ మేరకు పిఎస్‌లో ఫిర్యాదు చేయగా కానిస్టేబుల్‌పై కేసు నమోదైంది. దర్యాప్తు జరిగిన తర్వాత నిందితుడైన శ్రవణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మొత్తం మీద కానిస్టేబుల్ చేసిన తప్పుడు పనులపై పోలీసు శాఖలో ఉన్న తాధికారులు సీరియస్ అయ్యారు. ఈ కేసును క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారు.



నిందితునిగా మారిన కానిస్టేబుల్ శ్రవణ్‌కుమార్

ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించలేదు

తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

ఆరుతడి, సమీకృత పంటల సాగును

ప్రోత్సహిస్తున్నాం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త : రాష్ట్రంలో ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించిందంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రతిపక్షాలు మానుకోవాలని సూచించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వర్షాభావ పరిస్థితులు, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున, రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఆరుతడి, సమీకృత పంటల సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. కరువు మండలాల పంట నష్టంపై అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, అధికారులు క్షేత్ర స్థాయిలో ఇప్పటికే సర్వే మొదలుపెట్టారని పేర్కొన్నారు. అధిక మొత్తంలో నీరు అవసరమయ్యే పంటలను సాగు చేసి, చివరి దశలో నీటి కొరత కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నామని వివరించారు. రైతు వేదికలను కేంద్రంగా చేసుకుని వ్యవసాయ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా పంటల ఎంపిక, విత్తనాల లభ్యత, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై రైతులకు సూచనలు అందిస్తున్నామని చెప్పారు. పతి వారం నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం ద్వారా కూడా రైతులకు పంటల సాగుపై నిపుణులతో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుందని వెల్లడించారు. పంటల సాగు నుంచి దిగుబడుల విక్రయం వరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు



అమెరికాలో ముందస్తు ఓటింగ్‌లో సరికొత్త రికార్డు

4.96 కోట్ల మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగం

వాషింగ్టన్, అక్టోబరు 31: మధ్యంతర ఎన్నికలకు ముందే అమెరికాలో ఓటర్లు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. దాదాపు 5 కోట్ల మంది అమెరికన్లు ముందస్తుగా ఓటు వేయగా, ఇది గత ఎన్నికల రికార్డులను అధిగమించింది. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాకు చెందిన ఎలక్షన్ ల్యాబ్ వెల్లడించిన వివరాల ప్రకారం మొత్తం 4.96 కోట్ల ముందస్తు ఓట్లు నమోదయ్యాయి. వీటిలో సుమారు 2.29 కోట్ల మంది పోస్టల్ బ్యాలెట్ల ద్వారా ఓటు వేయగా, మరో 2.68 కోట్ల మంది పోలింగ్ కేంద్రాలకు వెళ్లి నేరుగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2022 మధ్యంతర ఎన్నికల్లో నమోదైన 4.59 కోట్ల ముందస్తు ఓట్ల రికార్డును ఈసారి అధిగమించారు. పార్టీల వారీగా నమోదైన ఓట్ల వివరాలను పరిశీలిస్తే డెమోక్రటిక్ పార్టీకి చెందిన ఓటర్లు 43 శాతంగా ఉన్నారు. రిపబ్లికన్ పార్టీ ఓటర్లు 32 శాతంగా నమోదయ్యారు. ఏ పార్టీకి చెందని వారు, ఇతర చిన్న పార్టీలకు చెందిన ఓటర్లు మిగిలిన 25 శాతంగా ఉన్నారు. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి 9.39 గంటల సమయానికి డెమోక్రటిక్ పార్టీకి చెందిన 1.03 కోట్ల మంది, రిపబ్లికన్ పార్టీకి చెందిన 75 లక్షల మంది, ఇతర పార్టీలకు లేదా ఏ పార్టీకి చెందని 59 లక్షల మంది ఓటు వేసినట్లు ఎలక్షన్ ల్యాబ్ వెల్లడించింది. ముందస్తు ఓటింగ్‌లో టెక్సాస్ రాష్ట్రం 69 లక్షల ఓట్లతో మొదటి స్థానంలో నిలిచింది. కాలిఫోర్నియాలో 51 లక్షలు, ఫ్లోరిడాలో 47 లక్షల ముందస్తు ఓట్లు నమోదయ్యాయి. ఎన్నికల పోటీ తీవ్రంగా ఉండే రాష్ట్రాల్లోనూ ఓటింగ్ గణనీయంగా నమోదైంది. జార్జియాలో 28 లక్షలు, నార్త్ కరోలినాలో 23 లక్షలు, మిషిగన్‌లో 19 లక్షలు, ఒహియోలో 15 లక్షల మంది ముందస్తుగా ఓటు వేశారు. 2022 మధ్యంతర ఎన్నికలతో పోలిస్తే ఈసారి టెక్సాస్‌లో ముందస్తు ఓటింగ్ 50 శాతం పెరిగింది. మైనే, మిషిగన్, నార్త్ కరోలినా, కాన్సాస్, సౌత్ కరోలినా రాష్ట్రాల్లోనూ ముందస్తు ఓటింగ్ గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా సౌత్ కరోలినాలో 83 శాతం పెరుగుదల నమోదైనట్లు సమాచారం. ఎన్నికల రోజుకు ముందే తమ మద్దతుదారులు ఓటు వేయాలని ఇరు ప్రధాన పార్టీలు ప్రచారం చేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందస్తు ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ విధానాలపై విమర్శలు చేశారు. ఈ విధానం హాస్యాస్పదం అంటూ, 2020 ఎన్నికల్లో తన ఓటమికి పోస్టల్ బ్యాలెట్లే కారణమని ఆరోపించారు.

నకిలీ విమాన టికెట్‌తో దుబాయ్‌కి వెళ్లేందుకు యత్నం

హైదరాబాద్(శంషాబాద్), అక్టోబరు 31, ప్రభాతవార్త: శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నకిలీ విమాన టికెట్ వ్యవహారం కలకలం రేపింది. నకిలీ పీఎన్ఆర్ నంబర్‌తో దుబాయ్ వెళ్లేందుకు యత్నించిన ఓ ప్రయాణికుడిని సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఎంట్రెన్స్ గేట్ వద్ద టికెట్‌ను తనిఖీ చేయగా, సిస్టమ్‌లో పీఎన్ఆర్ వివరాలు సరిపోలకపోవడంతో నకిలీదిగా గుర్తించారు. విచారణలో దుబాయ్‌లోని ఓ ట్రావెల్ ఏజెంట్ తనకు టికెట్ పంపినట్లు ప్రయాణికుడు వెల్లడించాడు. ఏజెంట్ మాటలు నమ్మి మోసపోయానని తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సదరు ట్రావెల్ ఏజెంట్‌పై ఆన్ లైన్‌లో కేసు నమోదు చేశారు. నకిలీ టికెట్ల వెనుక ముఠా ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. విదేశాలకు వెళ్లే ప్రయాణికులు గుర్తింపు పొందిన ఏజెన్సీల ద్వారానే టికెట్లు బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

చాక్లెట్ల కానుక, చిన్నారుల ముఖాల్లో వెన్నెల వేడుకల వేళ..

లోక్‌భవన్‌లో చిన్నారులతో గవర్నర్ మధుర క్షణాలు

హైదరాబాద్,అక్టోబరు31,ప్రభాతవార్త: చాక్లెట్ల తీపి కానుకలు.. చిన్నారుల బోసి నవ్వులు.. ఆప్యాయత నిండిన మధుర క్షణాలు.. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాల అవతరణ దినోత్సవం సందర్భంగా లోక్ భవన్‌లో ఈ ఆహ్లాదకర దృశ్యం శనివారం ఆవిష్కృతమైంది.ఈ వేడుకల్లో పలువురు చిన్నారులు తమ తల్లిండ్రులతో పాటు వచ్చారు.ఈ సమనించిన గవర్నర్ వేడుకలు ముగిసిన అనంతరం వారిని ప్రత్యేకంగా పిలిపించుకుని తన సతీమణి జానకి శుక్లాతో కలిసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేసి వారినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. గవర్నర్ ఆప్యాయ పలకరింపు, చాక్లెట్‌ల పంపిణీతో చిన్నారుల ముఖాలు చిరునవ్వులతో వెన్నెలలా వెలిగిపోయాయి.

మొదటి ఓటు చోరీతోనే నెహ్రూను ప్రధాని పీఠంపై కూర్చో బెట్టారు

చనిపోయిన వారి ఓట్లు తొలిగించాలా? వద్దా?: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 31,ప్రభాతవార్త: దేశానికి స్వాతంత్రం సిద్ధించిన సమయంలో కాంగ్రెస్ పార్టీలోని మెజారిటీ సభ్యులు సర్దార్ వల్లభాయ్ పటేల్‌ దేశ మొదటి ప్రధానమంత్రి కావాలని సంపూర్ణ మద్దతు ప్రకటించారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. నాటి నెహ్రూ కుటుంబం అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కాలరాసి, మొదటి 'ఓటు చోరీ'కి పాల్పడి ఏమాత్రం ప్రజా మద్దతు లేని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను ప్రధాని పీఠంపై కూర్చోబెట్టిందని విమర్శించారు. ఒకవేళ ఆనాడే పటేల్ తొలి ప్రధాని అయ్యి ఉంటే దేశ రూపురేఖలు, ముఖచిత్రం పూర్తిగా మారిపోయేవని,దేశం ఎదుర్కొన్న ఎన్నో సంక్లిష్ట సమస్యలకు శాశ్వత పరిష్కారం దక్కేదని పేర్కొన్నారు. భారతదేశ ఉక్కు మనిషి, అఖండ భారత నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ దేశంలో 13 కోట్ల మంది ఓట్లను తొలగించారని చెబుతున్న కాంగ్రెస్ వాస్తవాలు ఎందుకు చెప్పడం లేదని ధ్వజమెత్తారు. అందులో 2.8 కోట్ల మంది ఓటర్లు చనిపోయారు. వాటని తొలగించాలా వద్దా? అని ప్రశ్నించారు. వాళ్లకు ఎన్నికల సంఘం నోటీసులిచ్చినా స్పందించడం లేదని తెలిపారు. కాంగ్రెస్‌క చిత్తశుద్ధి ఉంటే 6.30 కోట్ల ఓటర్ల ఆచూకీ కనిపెట్టి ఆధారాలు సమర్పించాలని డిమాండ్ చేశారు. మరణించిన వాళ్లను,దొంగ ఓట్లను ఆమూకీ లేని వలస ఓట్లను ఓటర్ జాబితాలో చేర్చాలని కాంగ్రెస్ ధర్నాలు చేస్తోందా? అని ఆయన మండిపడ్డారు. పాతబస్తీ, మహేశ్వరం నియోజకవర్గాల్లో 2014కు ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్,అఫ్గానిస్తాన్ సహా విదేశాల నుంచి అక్రమంగా వలస వచ్చిన వేల మంది ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలా?వద్దా? ప్రజలే ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని అధికారికంగా జాతీయ సమైక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) పేరుతో దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో, గ్రామగ్రామాన బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ లోపాయికారీ ఒప్పందాలు, స్వార్థ రాజకీయ విధానాల వల్ల సంస్థానాల విలీన ప్రక్రియలో తీవ్ర గందరగోళం ఏర్పడిందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. అయినప్పటికీ, నాటి హోంమంత్రిగా సర్దార్ పటేల్ స్వతంత్రంగా, సాహసోపేత నిర్ణయాలు తీసుకుని 550కి పైగా సంస్థానాలను విజయవంతంగా భారత్‌లో విలీనం చేసి అఖండ భారతాన్ని ఆవిష్కరించారని కొనియాడారు. ప్రత్యేకించి హైదరాబాద్ సంస్థానంపై నిజాం ప్రైవేట్ సైన్యం రజాకార్లు 13 నెలల పాటు గ్రామాలపై పడి ఊచకోత కోస్తూ, మహిళలపై అత్యాచారాలకు ఒడిగడుతూ, దోపిడీలకు పాల్పడు తుంటే ఆనాటి ప్రధాని నెహ్రూ కనీసం స్పందించలేదని దుయ్యబట్టారు. కానీ, సర్దార్ పటేల్ నెహ్రూ మాటలను ఖాతరు చేయకుండా, తెలంగాణ ప్రజల ఆక్రందనలను చూసి ఆపరేషన్ పోలో ద్వారా సైన్యాన్ని రప్పించి, నిరంకుశ నిజాంను లొంగదీసుకుని ఇక్కడ మువ్వన్నెల జెండాను ఎగురవేశారని గుర్తుచేశారు. సూర్యచంద్రులు ఉన్నంతవరకు తెలంగాణ ప్రజలు సర్దార్ పటేల్ చేసిన త్యాగాన్ని, చూపిన చొరవను గుండెల్లో పెట్టుకుంటారని, ప్రతి తెలంగాణ బిడ్డ ఇంట్లో పటేల్ చిత్రపటం ఉండాలని ఆకాంక్షించారు. మరోవైపు, జమ్ము కశ్మీర్ వ్యవహారంలో సర్దార్ పటేల్ జోక్యాన్ని నెహ్రూ అడ్డుకుని, తన స్వార్థ రాజకీయాలు, పాకిస్థాన్ అనుకూల వైఖరితో ఆ ప్రాంతాన్ని దాదాపు 75 ఏళ్లపాటు రావణ కాష్ఠంలా మార్చారని ఆరోపించారు. నెహ్రూ చారిత్రక తప్పిదాల వల్ల సరిహద్దు ఉగ్రవాదం, యుద్ధాలు చెలరేగి సుమారు 46 వేల మంది అమాయకపౌరులు, జవాన్లు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

పాకిస్థాన్ ప్రేరేపిత నకిలీ నోట్లు, ఆయుధాల అక్రమ రవాణా, రక్తపాతానికి నెహ్రూ విధానాలే కారణమని స్పష్టం చేశారు. అయితే, ప్రధాని నరేంద్ర మోదీ దృఢ సంకల్పంతో ఆర్టికల్ 370ని రద్దు చేసి, కశ్మీర్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని సంపూర్ణంగా అమలు చేసి పటేల్ కన్న కలలను సాకారం చేశారని కొనియాడారు.

బార్డోలీ సత్యాగ్రహంలో రైతు పక్షపాతిగా పోరాడి ఖిసర్దార్‌ఖి బిరుదు పొందిన పటేల్ చరిత్రను దేశ రైతాంగం, యువత గుర్తుచేసుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలోని ఓటు బ్యాంకు రాజకీయాలు, బుజ్జగింపు విధానాలు, అవినీతి, కుటుంబ పాలన తీరును నేటి యువత తెలుసుకోవాలని.. సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశభక్తి, జాతీయ సమైక్యతా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతం రావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కర్ణాటక సహ ఇన్‌ఛార్జ్ డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్‌వి సుభాష్ పాల్గొన్నారు.



శనివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

దేశ ఐక్యతే అసలైన బలం.. వైవిధ్యమే మన ప్రత్యేకత

సర్దార్ పటేల్ ధైర్యసాహసాలు, దూరదృష్టి నేటికీ స్ఫూర్తిదాయకం

జమ్మూకాశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాల అవతరణ దినోత్సవంలో గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త: భారతదేశ భౌగోళిక సరిహద్దుల కంటే ప్రజల మధ్య ఐక్యత, అంకితభావమే దేశానికి అసలైన బలమని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ గొప్పతనమని, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు పరస్పరం కలుసుకుని, తమ సంస్కృతులు, సంప్రదాయాలను పంచుకోవడం ద్వారా జాతీయ సమైక్యత మరింత బలపడుతుందని పేర్కొన్నారు. 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా శనివారం లోక్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాల అవతరణ దినోత్సవ వేడుకల్లో గవర్నర్ పాల్గొని ప్రసంగిం చారు. తొలుత సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. దేశంలోని అనేక సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో సర్దార్ పటేల్ కీలక పాత్ర పోషిం చారని, ఆయన అసాధారణ ధైర్యసాహసాలు, దూరదృష్టి ఆధునిక భారతదేశ నిర్మాణంలో చిరస్మరణీయమని గవర్నర్ పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదా యకమన్నారు.జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అవతరణ దినోత్సవం దేశ ఐక్యతను, సమగ్రతను మరోసారి గుర్తుచేసే చారిత్రక సందర్భమని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ దార్శనికతకు అనుగుణంగా లోక్‌భవన్‌లో వివిధ రాష్ట్రాల అవతరణ దినోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. లద్దాఖ్ ఎత్తైన పర్వత శ్రేణులు, విశిష్ట సంప్రదాయాలకు నిలయమని, క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల్లోనూ అక్కడి ప్రజలు చూపుతున్న ధైర్యం, పట్టుదల ప్రశంసనీయమని గవర్నర్ పేర్కొన్నారు. హెమిస్, థిక్సే వంటి ప్రాచీన బౌద్ధ మఠాలు ఆ ప్రాంత ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకలని, దలైలామా బోధనలు శాంతి, కరుణ సందేశాన్ని చాటుతు న్నాయని చెప్పారు. తెలంగాణ, జమ్మూకశ్మీర్ భౌగోళికంగా భిన్నమైన ప్రాంతాలైనా ప్రజల మధ్య అనుబంధం బలంగా ఉందన్నారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన పలువురు విద్యార్థులు హైదరాబాద్‌లోని విద్యాసంస్థల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఈ మూడు యూనిటరీ నిర్వహించిన వేడుకల్లో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా, డిప్యూటీ జెనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ బ్రిగేడియర్ పునీత్ కుమార్ ద్వివేది,సంయుక్త కార్యదర్శి కొమండూరు శశి కిరణ్, జమ్మూ కశ్మీర్, లడ్డాక్ ప్రాంతాలకు చెందిన అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లో అండాల మాఫియా గుట్టురట్టు

డబ్బు ఆశచూపి యువతుల అండాల సేకరణ

కార్పొరేట్ ఆస్పత్రులకు సరఫరా?

హైదరాబాద్ (హుడాకాంప్లెక్స్), అక్టోబరు 31, ప్రభాతవార్త : రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మరో సంచలన వ్యవహారం వెలుగులోని వచ్చింది. మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతుల అక్రమ అండాల సేకరణ దందా తీవ్ర కలకలం రేపుతుంది. బేగంపేట ఘటన మరువకముందే మరోచోట వెలుగు చూసింది. తాజాగా సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఒక ఇంట్లో కాలేజీ విద్యార్థినులను అక్ష్యంగా చేసుకుని నిర్వహిస్తున్న ముఠాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే విశ్వసనీయ వ్యక్తుల సమాచారంతో సరూర్‌నగర్ పోలీసులు సదరు నివాసంలో అకాస్మిక దాడులు నిర్వహించి అక్కడ ఉన్న 18 మంది యువతులతో పాటు,ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు అరోపణలు ఎదుర్కుంటున్న దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కాలేజీ విద్యార్థినులు, నిరుపేద యువతులను లక్ష్యంగా చేసుకుని వివిధ రాష్ట్రాకు చెందిన పేద యువతులను హైదరాబాద్‌కు రప్పించి సరూర్‌నగర్‌లోని వెంకటేశ్వర కాలనీలోని ఒక ఇంట్లో శెట్టి వరింగ్ ఉమెన్స్ అద్దె హాస్టల్‌లో ఉంచి ఈ దందా నడుపుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. వారికి పెద్ద మొత్తంలో డబ్బు ల ఆశ చూసించి, ఇంజేక్షన్లు ఇచ్చి అండాలను సేకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.



అనుమానితుడు దుర్గాప్రసాద్

సేకరించిన అండాలను నగరంలోని కొన్ని ప్రముఖ ఐవీఎస్ కేంద్రాలకు అనధికారికంగా సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. పోలీసులు అక్కడ ఉన్న 18 మంది యువతులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు వేగవంతం చేశారు. దీనివెనుక ఉన్న ప్రధాన సూత్రదారులు ఎవరు? ఈ మూఠాతో ఏయే ఐవీఎఫ్ సెంటర్లు చేతులు కలిపాయనే కోణంలో సమగ్ర విచారణ జరుపు తున్నారు. ఇదిలా ఉంటే హైదరాబాద్‌తో పాటు దేశ వ్యాప్తంగా అక్రమ అండాల సేకరణ, సరోగసి ముఠాల అక్ర మాలు వరుసగా బయట పడుతుండటం అందోళన కలిగి స్తుంది. సరూరనగర్ తరహాలోనే ఇటీవల బేగంపేట, ప్రకాశ్‌నగర్ ప్రాంతాల్లోని గర్ల్స్ హాస్టళ్లపై పోలీసులు దాడులు నిర్వహించారు. హాస్టళ్ల పేరుతో ఇతర రాష్ట్రాల (బీహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఒరిస్సా) నుండి యువతులను నగరానికి రప్పించి వారి నుండి చట్టవిరుద్ధంగా అండాలను సేకరిస్తున్న మేఠాల గుట్టు రట్టు చేశారు.వరుసగా ఈ ఘటనలు బయటపడుతున్న క్రవంలో పోలీసులు కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

రియల్ ఎస్టేట్ రంగానికి అండ

విద్యుత్ కనెక్షన్లలో పూర్తి పారదర్శకత

దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి జితేష్

హైదరాబాద్, అక్టోబరు 31, ప్రభాతవార్త: రియల్ ఎస్టేట్, నిర్మాణ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి అండగా నిలుస్తూ తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తోందని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ పాటిల్ తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన రియల్‌ఎస్టేట్ సంస్థ సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియలో పూర్తి పారదర్శకత, ఏకరూపత, సరళీకరణకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఏకరీతి సర్వీస్ లైన్ ఛార్జీల విధానం ప్రకారం అర్హత కలిగిన 11 కేవీ హెచ్‌టీ కొత్త కనెక్షన్లు, అదనపు లోడ్ దరఖాస్తులకు కాంట్రాక్టెడ్ డిమాండ్‌పై కేవీఏకు రూ.4,078 చొప్పున ఓవర్‌హెడ్ సర్వీస్ లైన్ ఛార్జీ వర్తిస్తుందన్నారు. ప్రస్తుత 11 కేవీ నెట్‌వర్క్ నుంచి ఒక కిలోమీటరు పరిధిలోపు కామన్ ఫీడర్ ద్వారా ఓవర్‌హెడ్ లైన్‌తో సరఫరా పొందే కనెక్షన్లకు ఈ విధానం అమలవుతుందని వెల్లడించారు. ఈ ఏకరీతి విధానం వల్ల సర్వీస్ లైన్ ఛార్జీల విషయంలో ముందస్తు స్పష్టత లభించడంతో పాటు, వ్యక్తిగత అంచనాలపై ఆధారపడే విధానానికి బదులుగా నిర్దిత ఛార్జీలతో పూర్తి పారదర్శకత ఏర్పడుతుందని తెలిపారు. తెలంగాణలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే అంతర్జాతీయ పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలకు రాష్ట్రంలోని పారదర్శకమైన విద్యుత్ సేవలు, సరళమైన విధానాలు మరింత భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు.



శనివారం తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రేవంత్‌రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్

భూములను కాపాడిందే బిఆర్ఎస్: మాజీమంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబరు31,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మియాపూర్ భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు ఆరో పణలు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిపోనున్నారని దుయ్యబట్టారు. సీఎంకు అబద్ధాల్లో ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని వ్యాఖ్యనించారు. మియాపూర్ భూములు తెలంగాణ ప్రభుత్వానికి చెందినవేనని సుప్రీంకోర్టు వెల్లడించిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. అబద్ధాలతో క్రెడిట్ చోరీలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మియాపూర్ భూముల విషయంపై సుప్రీం కోర్టు జడ్జిమెంట్ కాపీ కూడా ఇంకా రాకముందే ఆ భూములను అమ్ముకోవాలనే ఆతృత సీఎంలో కనిపించిందని ఆరోపించారు. కెసిఆర్ సీఎం అయ్యాక వైద్యనాథన్ అనే సీనియర్ అడ్వకేట్‌ను నియమించి భూములు ప్రభుత్వానికి దక్కేలా న్యాయపోరాటం చేసి కాపాడారని గుర్తు చేశారు. మంచిరేవులలో 142 ఎకరాల భూమిని తామే కాపాడామని ఈ భూములపై 40-50 ఏళ్లు న్యాయపోరాటం జరిగిందని చెప్పారు. 2010లో కాంగ్రెస్ కోర్టులో ఈ కేసు ఓడిపోయిందని విమర్శించారు. భూపాలపల్లి భూములు, హయాత్‌నగర్‌లోని భూములను కాపాడేందుకు బీఆర్ఎస్ అన్నిరకాలుగా కాపాడిందని పేర్కొన్నారు.

'400 ఎకరాల సెంట్రల్ యూనివర్సిటీ భూమిని బాంబే స్టాక్ ఎక్స్చేంజ్‌లో కుదువపెట్టారు. రూ. 10 వేల కోట్ల అప్పు కోసం ముంబై బ్రోకర్‌కు రూ.400 కోట్ల కమిషన్, దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించు రేవంత్‌రెడ్డి అని హరీశ్‌రావు సవాల్ విసిరారు. 'వంటంతా మేము వండితే, చివర్లో గంట తిప్పి నేనే వండినా అంటున్నడు. ఇది ఓట్ చోరీ కాదు, పక్కా క్రెడిట్ చోరీ, జడ్జిమెంట్ కాపీ చేతికి రాకముందే మియాపూర్ భూములు అమ్మమని కలెక్టర్‌ను పరుగులు పెట్టిస్తున్నడు, ఎవరి దగ్గర అడ్వాన్సులు తీసుకున్నవ్ రేవంత్ రెడ్డి?' అని ప్రశ్నించారు. 'మియాపూర్ కేసు సుప్రీంకోర్టులో 192 సార్లు విచారణకు వచ్చింది అందులో 86 సార్లు వాదించింది బీఆర్ఎస్ నియమించిన వైద్యనాథన్‌నే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జరిగింది కేవలం 11 విచారణలు మాత్రమే' అని చెప్పారు.

'సర్' అమలుకాక ముందే కాంగ్రెస్ పతనం ప్రారంభమైంది: కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్,అక్టోబరు31,ప్రభాతవార్త: సర్ అమలు కాక ముందు నుండే కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని, ఓడిపోతే సర్‌పైన ఏడుస్తూ, గెలిస్తే మౌనంగా ఉంటారా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 2004లో చనిపోతే ఆయన ఓటు ఇంకా ఉందని, తొలగించాలా? వద్దా అని ప్రశ్నించారు. ఈ దేశం కాని వాళ్లు అక్రమంగా వలస వచ్చి ఓటర్‌గా నమోదు చేసుకుని ఈ దేశ రాజకీయాలను శాసిస్తామంటే ఊరుకోవాలా అని ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లో 50 ఏళ్లుగా అధికారంలోకి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సిక్కింలో 1975లో రాష్ట్ర హోదా పొందినప్పటి నుంచి ఒక్కసారి కూడా అధికారంలోకి కాంగ్రెస్ రాలేదని బండి సంజయ్ గుర్తుచేశారు. యూపీలో 37 ఏళ్లుగా, బీహార్‌లో 36 ఏళ్లుగా, త్రిపురలో 34 ఏళ్లుగా, గుజరాత్‌లో 31 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారంలోకి రానేలేదని స్పష్టం చేశారు. ఒడిశా, జార్ఖండ్‌లో 26 ఏళ్లుగా, మధ్యప్రదేశ్, నాగాలాండ్‌లో 23 ఏళ్లుగా, గోవాలో 14 ఏళ్లుగా కాంగ్రెస్‌కు అధికారం అందని ద్రాక్షగానే మిగిలిపోయిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్, హరియాణా, మహారాష్ట్రాలో 12 ఏళ్లుగా, అరుణాచల్ ప్రదేశ్, అస్సాంలో పదేళ్లుగా, మణిపూర్, ఉత్తరాఖండ్‌లో 9 ఏళ్లుగా హస్తం పార్టీ అధికారంలోనే లేదని చెప్పుకొచ్చారు. మేఘాలయ, మిజోరాంలో 8 ఏళ్లుగా, పంజాబ్‌లో 4 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారంలోకి ఎందుకు రాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. 2014 నుంచి కాంగ్రెస్ ఓడిపోతునే ఉందని అన్నారు. కేరళం, తెలంగాణ, కర్ణాటకలో ఈ ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఎలక్షన్ జరిగితే కాంగ్రెస్ గెలిచిందని బండి సంజయ్ ప్రస్తావించారు.

ఓడిపోతే ఈవీఎంలపైనా విష ప్రచారం చేయడం కాంగ్రెస్‌కే చెల్లిందని ధ్వజమెత్తారు. ఈవీఎంలతో తొలిసారి ఎన్నికలకు వెళ్లిందే రాజీవ్ గాంధీ హయాంలో అని గుర్తుచేశారు. బ్యాలెట్ ద్వారా జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందని చెప్పారు. అస్సాంలో బ్యాలెట్‌తో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిందని తెలిపారు. తెలంగాణలో బ్యాలెట్ ద్వారా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందని అన్నారు. నిన్నటికి నిన్న 4 రాష్ట్రాల్లో బ్యాలెట్‌తో జరిగిన 28 ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ఏం సమాధానం చెబుతుందని బండి సంజయ్ ప్రశ్నించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పై కాంగ్రెస్ బురద చల్లడం దుర్మార్గంఎన్నికల సంఘాన్ని,



ఫైనల్స్‌కు భారత్

బంగ్లాదేశ్‌పై ఘన విజయం

అహ్మదాబాద్: కామన్వెల్త్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ 2026 సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 56-27 తేడాతో ఘన విజయం సాధించి భారత పురుషుల కబడ్డీ జట్టు ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. 29 పాయింట్ల తేడాతో సాధించిన ఈ విజయం పురుషుల టైటిల్ పోరులో భారతదేశానికి స్థానాన్ని సాధించింది. దీంతో పురుషుల, మహిళల ఫైనల్స్ రెండింటిలోనూ దేశానికి ప్రాతినిధ్యం ఖాయమైంది. ఈ టోర్నమెంట్‌లో భారత మహిళల జట్టు అంతకుముందే ఫైనల్‌కు అర్హత సాధించింది. మ్యాచ్ అనంతరం బంగ్లాదేశ్ జట్టు సభ్యులకు, దాని కోచింగ్ సిబ్బందికి వారి భాగస్వామ్యానికి గుర్తింపుగా పతకాలు, ట్రోఫీని బహూకరించారు. సెమీఫైనల్ ఓటమితో పర్యటక జట్టు ప్రయాణం ముగిసింది. కామన్వెల్త్ కబడ్డీ టోర్నమెంట్‌లో పోటీపడే జట్లను ఒకచోట చేర్చిన ఈ ఛాంపియన్‌షిప్‌లో, బంగ్లాదేశ్‌పై భారత్ సాధించిన అద్భుతమైన ప్రదర్శన ఆ దేశ ప్రచారాన్ని మరింత బలోపేతం చేసింది. రెండు భారత జట్లు ఫైనల్‌కు చేరడంతో తుది మ్యాచ్‌లలో ఆతిథ్య జట్టు తమ డబుల్ క్వాలిఫికేషన్‌ను ఛాంపియన్‌షిప్ టైటిల్‌గా మార్చుకోవాలని చూస్తుంది.

ఆట



గ్వాంగ్‌జౌ ఓపెన్‌లో వీనస్-జానిస్ జోడి ఓటమి

గ్వాంగ్‌జౌ: వీనస్ విలియమ్స్ ఎనిమిదేళ్లలో తన మొదటి డబ్ల్యూటిఎ టూర్ సెమీఫైనల్‌లో ఓడిపోయింది. 46 ఏళ్ల విలియమ్స్-ఇండోనేషియా భాగస్వామి జానిస్ జెన్, శనివారం గ్వాంగ్‌జౌ ఓపెన్ డబుల్స్ సెమీఫైనల్స్‌లో పోలినా కుదెరెమెటోవా-మరియా టిమోఫీవా చేతిలో 6-4, 6-7 (8), 10-6 తేడాతో ఓడిపోయారు. గ్వాంగ్‌జౌలో జరిగిన డబ్లూటిఎ 250 టోర్నమెంట్‌కు సింగిల్స్, డబుల్స్ రెండింటిలోనూ విలియమ్స్‌కు వైల్డ్‌కార్డ్ ఎంట్రీలు లభించాయి. అంతకుముందు జరిగిన మొదటి రౌండ్‌లో ఆమె సింగిల్స్‌లో టీనేజర్ లిల్లీ టాగర్ చేతిలో 6-2, 6-2 తేడాతో ఓడిపోయింది. 2016 రియో ఒలింపిక్స్, వింబుల్డన్ తర్వాత విలియమ్స్ తొలిసారిగా డబ్ల్యూటిఎ టూర్ డబుల్స్ సెమీఫైనల్‌కు చేరుకోగా, కాలిఫోర్నియాలోని ఇండియన్ వెల్స్‌లో 2018 తర్వాత ఆమెకు ఇదే తొలి టూర్ సెమీఫైనల్. ప్రస్తుతం సింగిల్స్‌లో 599వ ర్యాంక్‌లో ఉన్న విలియమ్స్, యూఎస్ ఓపెన్ తర్వాత రెండు నెలలకు తన మొదటి సింగిల్స్ మ్యాచ్ ఆడుతోంది. యూఎస్ ఓపెన్‌లో ఆమె సోఫియా కెనిన్ చేతిలో మొదటి రౌండ్‌లోనే ఓడిపోయింది. గత ఏడాది జూలై నుండి టూర్‌లో విలియమ్స్ వరుసగా 16 సింగిల్స్ మ్యాచ్‌లలో ఓడిపోయింది.



మొదటి రోజు ఆటలో..

న్యూజిలాండ్‌పై భారత్ 291/7 స్కోరు

సెంచరీకి చేరువలో ధ్రువ్ జురెల్

క్రైస్ట్‌చర్చ్: క్రైస్ట్‌చర్చ్‌లోని హేగ్లీ ఓవల్‌లో న్యూజిలాండ్ ఎ జట్టుతో శనివారం జరిగిన రెండవ నాలుగు రోజుల మ్యాచ్ మొదటి రోజు ఆట ముగిసేనాటికి, ధ్రువ్ జురెల్ శతకానికి ఒక పరుగు దూరంలో ఉండగా, భారత్ ఎ జట్టు 7 వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. జురెల్ 99 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు, ఆట ముగిసే సమయానికి 25 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్న ఆకాష్ దీప్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు విడదీయరాని 69 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. పర్యాటక జట్టు భాగస్వామ్యాలను నిర్మించడానికి ఇబ్బంది పడగా, కేవలం మరో ఇద్దరు బ్యాటర్లు మాత్రమే 40 పరుగుల మార్కును దాటారు. ఆ తరుణంలో ఈ జోడీ ఇండియా కోలుకోవడానికి సహాయపడింది.

సాయి సుదర్శన్ 41 పరుగులు చేయగా, దేవదత్ పడిక్కల్ 80 పరుగులు చేసి ఔటయ్యాడు. యశ్వి జైస్వాల్ మరో నిరాశాజనకమైన ప్రదర్శనతో 4 బంతుల్లో డకౌట్ అయ్యాడు. దిగువ వరుసలో మానవ్ సుతార్ 46 బంతుల్లో 22 పరుగులతో పోరాటపటిమతో కొంత ప్రతిఘటన చూపినప్పటికీ, జురెల్ మాత్రం ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. న్యూజిలాండ్ బౌలింగ్ విభాగంలో ఫ్రేజర్ షీట్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, రోజును 50 పరుగులకు నాలుగు వికెట్లతో ముగించాడు.



హాంగ్ కాంగ్ సిక్సెస్..

ఓటమితో టైటిల్ రేసు నుండి భారత్ ఔట్

6 వికెట్ల తేడాతో యుఎఇ గెలుపు

హాంకాంగ్: హాంగ్ కాంగ్ సిక్సెస్ 2026 టోర్నీలో భారత్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. శనివారం ఉదయం యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. అంతకు ముందు ఈ నెల 30న పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్లతో ఓడిన కృనాల్ పాండ్యా సారథ్యంలోని భారత్ ఓటమిపాలైంది. ఈ వరుస పరాజయాలతో గ్రూప్ సీలో అట్టడుగు స్థానంలో నిలిచి టైటిల్ రేసు నుంచి తప్పుకుంది. కన్సోలేషన్ ట్రోఫీ కోసం జరిగే బౌల్ సెమీఫైనల్స్ రౌండ్‌లో భారత్ తలపడనుంది. ఇక యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 6 ఓవర్లలో 94 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ త్రిపాఠి(7 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 24), నటరాజన్(14 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 38) టాప్ స్కోరర్లుగా నిలిచారు. కృనాల్ పాండ్యా(8 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 15) పర్వాలేదనిపించగా, నితీష్ రాణా(6), రాహుల్ తెవాటియా(1), శశాంక్ సింగ్(1) తీవ్రంగా నిరాశపర్చారు. యూఏఈ బౌలర్లలో జాహిద్ అలీ(3/32) మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం యూఏఈ 4.2 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 97 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. కెప్టెన్ ఖలిద్ షా(14 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లతో 52 నాటౌట్) విధ్వంసకర హాఫ్ సెంచరీతో రాణించగా, అన్ష్ టండూన్(12 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 39 నాటౌట్) సత్తా చాటాడు. భారత జట్టు నిండా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) స్టార్లున్నా వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోవడాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.





తొలి టెస్టులో వెస్టిండీస్ గెలుపు

8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ ఓటమి

ఢాకా: రోస్టన్ చేజ్ ఐదు వికెట్ల ప్రదర్శన, బ్రాండన్ కింగ్ అజేయ అర్ధశతకం సహాయంతో వెస్టిండీస్ శనివారం జరిగిన తొలి టెస్టులో బంగ్లాదేశ్‌ను 8 వికెట్ల తేడాతో ఓడించి, రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. నాలుగో రోజు ఉదయం 79/6 స్కోరుతో తమ రెండో ఇన్నింగ్స్‌ను తిరిగి ప్రారంభించిన బంగ్లాదేశ్, తమ మొత్తం ఆధిక్యాన్ని 100 పరుగులకు పైగా పెంచుకోవాలని ఆశించింది. అయితే, నయీమ్ హసన్ కొంత ప్రతిఘటన చూపినప్పటికీ, వెస్టిండీస్ బౌలర్లు అతిథి జట్టు గణనీయమైన స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. జోమెల్ వారికన్ ఆరంభంలోనే వికెట్ తీశాడు, స్లిప్‌లో చేజ్ చేత జేకర్ అలీని క్యాచ్ పట్టించాడు. నయీమ్ 52 పరుగులతో తన తొలి టెస్ట్ అర్ధ సెంచరీని పూర్తి చేసి బంగ్లాదేశ్‌ను పోటీలో నిలబెట్టాడు. అయితే చేజ్ అతడిని అవుట్ చేసి, వారికన్ ప్రతిఘటనకు తెరదించాడు. వర్షంతో అంతరాయం కారణంగా బంగ్లాదేశ్ 142 పరుగులకే ఆలౌట్ కావడంతో, వెస్టిండీస్‌కు 170 పరుగుల లక్ష్యం నిర్దేశించబడింది. ఆతిథ్య జట్టులోని కింగ్, జాన్ క్యాంప్‌బెల్ కలిసి 112 పరుగుల పటిష్టమైన ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇద్దరు బ్యాటర్లు బౌండరీలు బాదుతూ బంగ్లాదేశ్ ఒత్తిడి పెంచకుండా నిరోధించారు. షోరిఫుల్ ఇస్లాం బౌలింగ్‌లో ఎడ్జ్ ఇచ్చి తన వికెట్లను పడగొట్టుకున్న క్యాంప్‌బెల్, 49 పరుగుల వద్ద అర్ధశతకాన్ని తృటిలో కోల్పోగా, కింగ్ వరుసగా 3 బౌండరీలతో అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. టాగెనరైన్ చందర్‌పాల్ స్వల్ప స్కోరుకే ఔటవడంతో, బంగ్లాదేశ్‌కు తిరిగి పుంజుకోవడానికి అవకాశం లభించింది. తన నియంత్రణలోనే కొనసాగాడు. హోల్డ్ కూడా కింగ్ తో జతకలిసి స్కోరింగ్‌ను వేగవంతం చేయడంతో, ఆతిథ్య జట్టు లక్ష్యానికి మరింత చేరువైంది. కింగ్ 81 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, హోల్డ్ క్రీజులో కొనసాగడంతో వెస్టిండీస్ సునాయాసంగా ఛేజింగ్‌ను పూర్తి చేసింది.



వొడాఫోన్‌లో 16.2 శాతం వాటా కొనుగోలుకు సిసిఐ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ,అక్టోబరు 31: ఫ్రాన్స్‌కు చెందిన బిలియనీర్, టెలికాం సంస్థ ఇలియాడ్ వ్యవస్థాపకుడు జేవియర్ నీల్‌కు వొడాఫోన్‌లో వాటా కొనుగోలుకు సిసిఐ అనుమతినిచ్చింది. బ్రిటన్‌కు చెందిన వోడాఫోన్ గ్రూప్ పిఎల్‌సిలో 16.2 శాతం వాటా కొనుగోలుకు సిసిఐ ఆమోదం తెలిపింది. జేవియర్ నీల్ తన కుటుంబ పెట్టుబడి సంస్థ వేగా ఎస్ఎఎస్ ద్వారా ఈ వాటాను కొనుగోలు చేస్తున్నారు. ఈ సంస్థ మాయా ఎస్ఎఎస్‌కు పూర్తిస్థాయి అనుబంధ సంస్థగా ఉంది. మాయా ఎస్ఎఎస్ ఫ్రాన్స్ చట్టాల ప్రకారం స్థాపించిన జాయింట్ స్టాక్ కంపెనీ. వోడాఫోన్ గ్రూప్‌లో జారీ చేసిన మొత్తం షేర్ క్యాపిటల్‌లో 16.2 శాతం వాటాను వేగా ఎస్ఎఎస్ కొనుగోలు చేయనున్నట్లు ప్రతిపాదనలో పేర్కొన్నారని సిసిఐ తెలిపింది. వేగా ఎస్ఎఎస్‌కు భారత్‌లో ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు లేదా వ్యాపార ఉనికి లేదు. మరోవైపు, వోడాఫోన్ సంస్థ భారతదేశంలో వోడాఫోన్ ఐడియా లిమిటెడ్ ద్వారా మొబైల్, ఫిక్స్‌డ్ టెలికాం సేవలను అందిస్తోంది. బ్రిటన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వోడాఫోన్ గ్రూప్ యూరప్, ఆఫ్రికా ప్రాంతాల్లో ప్రముఖ టెలికమ్యూనికేషన్స్ సంస్థగా ఉంది. ఈ ప్రతిపాదిత లావాదేవీకి కమిషన్ ఆమోదం తెలిపినట్లు సిసిఐ తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. ఈ ఏడాది జూలైలో వేగా ఎస్ఎఎస్, ఎమిరేట్స్ టెలికమ్యూనికేషన్స్ గ్రూప్ కంపెనీ పిజెఎస్‌సితో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం వోడాఫోన్ గ్రూప్‌లో సుమారు 16.2 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. ఈ లావాదేవీ విలువ సుమారు 4.4 బిలియన్ బ్రిటిష్ పౌండ్లు (5.1 బిలియన్ యూరోలు). మొత్తం నగదు రూపంలో చెల్లించనున్నారు. వోడాఫోన్‌లో వాటాలను కలిగి ఉండటమే ప్రధాన ఉద్దేశంగా వేగా సంస్థను ఏర్పాటు చేశారు. ఈ లావాదేవీ పూర్తయిన తర్వాత వోడాఫోన్ గ్రూప్‌లో అతిపెద్ద వాటాదారుగా వేగా అవతరించనుంది. ఇటలీ, స్పెయిన్ దేశాల్లోని తన వ్యాపార విభాగాలను విక్రయించడంతో పాటు, నెదర్లాండ్స్‌లోని జాయింట్ వెంచర్‌లో తన 50 శాతం వాటాను కూడా విక్రయించింది.

పత్తి దిగుమతులపై కస్టమ్స్ సుంకం మినహాయింపు పొడిగింపు



న్యూఢిల్లీ, అక్టోబరు 31: కేంద్ర ప్రభుత్వం దేశీయ వస్త్ర, దుస్తుల పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. పత్తి దిగుమతులపై కస్టమ్స్ సుంకం మినహాయింపును మరో రెండు నెలల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ మినహాయింపు 2026 డిసెంబరు 31 వరకు అమల్లో ఉండనుంది. వాస్తవానికి ఈ గడువు 2026 అక్టోబరు 31తో ముగియాల్సి ఉంది. దేశీయ మార్కెట్లో ముడిసరుకు లభ్యతను పెంచడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం. గడువు పొడిగింపు వల్ల వస్త్ర, దుస్తుల రంగంలో ముడిసరుకు వ్యయం తగ్గే అవకాశం ఉంది. తద్వారా తయారీదారులు, వినియోగదారులకు మిల్లులు, దుస్తుల తయారీ సంస్థలకు పత్తి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడటమే ఈ నిర్ణయం వెనుక ప్రధానలక్ష్యం. అంతర్జాతీయ, దేశీయ మార్కెట్లలో ధరల హెచ్చుతగ్గుల ప్రభావం నుంచి పరిశ్రమకు కొంత రక్షణ కల్పించడంతో పాటు ముడిసరుకు ఖర్చుల భారాన్ని తగ్గించనుంది. ముఖ్యంగా ఉత్పత్తి వ్యయాల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఈ నిర్ణయం నేరుగా ప్రయోజనం చేకూర్చనుంది. పన్ను రహిత దిగుమతుల గడువు పొడిగింపు వల్ల తయారీదారులు, తుది వినియోగదారులకు వ్యయపరమైన ఊరట లభిస్తుందని అధికారులు తెలిపారు. అదే సమయంలో దేశీయ పత్తి రైతుల ఆర్థిక ప్రయోజనాలకు కూడా సమతుల్యత కల్పించేలా ఈ చర్య ఉంటుందని పేర్కొన్నారు. మార్కెట్లో ముడి పత్తి లభ్యత పెరగడం వల్ల వస్త్ర, గార్మెంట్ పరిశ్రమల ఉత్పత్తి సామర్థ్యం, కార్యకలాపాల సామర్థం మెరుగుపడటంతో పాటు ధరల పోటీతత్వం పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రభావం 2026 సంవత్సరం చివరి వరకు పరిశ్రమకు తోడ్పడుతుందని అంచనా వేస్తున్నారు.

పాలిమర్‌నోట్ల చెలామణికి ఆర్బీఐ కసరత్తు



న్యూఢిల్లీ, అక్టోబరు 31: కాగితపు కరెన్సీ స్థానంలో పాలిమర్‌నోట్లు అంటే పలుచని ప్లాస్టిక్ కరెన్సీ నోట్ల చెలామణికి వేగంగా ఆర్బీఐ పావులు కదుపుతోంది. ఇప్పుడు ఈ నోట్ల తయారీలో కొత్త విధానాన్ని పరీక్షించేందుకు ఆర్బీఐ సిద్ధమవుతున్నది. ప్రస్తుత పేపర్ నోట్లకు బదులుగా పాలిమర్‌తో తయారు చేసిన రూ.10, రూ.20 నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలని ఆర్బీఐ భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఇదివరకే దీనికి ఆమోద ముద్ర కూడా వేసింది. 2027 ఏప్రిల్ 1నుంచి ప్రారంభ మయ్యే తదుపరి ఆర్థిక సంవత్సరంలో దీనిని ప్రయోగాత్మకంగా పరీక్షించే అవకాశం ఉందని రిపోర్ట్స్ చెబుతున్నాయి. అయితే ఇక్కడ కొత్త రూ. 10, రూ. 20 ప్లాస్టిక్ నోట్లు వస్తే పాత నోట్లను పూర్తిగా తొలగిస్తారా కొత్తనోట్ల పరిమాణం మారుతుందా అనేసందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే పాలిమర్ నోట్ల కొలతలను ప్రస్తుతం ఉన్న రూ. 10, రూ. 20 నోట్ల మాదిరిగానే ఉంచే అవకాశం ఉంది. కొత్త కరెన్సీ నోట్ల పరిమాణంలో మార్పులుచేస్తే అప్పుడు బ్యాంకులు, ఎటిఎం నిర్వహణలో మార్పులు చేయాల్సి రావొచ్చు.

ప్రస్తుతం ఎటిఎంల్లో వివిధ విలువల నోట్లను నిల్వ చేయడానికి ప్రత్యేక క్యాసెట్స్ ఉంటాయి. నోట్ల సైజ్ మారితే వాటిని సరిగా గుర్తించడం, లెక్కించడం, పంపిణీ చేయడం కోసం కొన్ని యంత్రాల్లో మార్పులు చేయాల్సి వస్తుంది. అందుకే పాలిమర్ నోట్లను ప్రస్తుత నోట్ల సైజుల్లోనే ఉంచితే బ్యాంకులకు అదనపు ఖర్చులు తగ్గుతాయని భావిస్తున్నారు. సాధారణంగా మనం ప్రస్తుతం ఉపయోగించే కరెన్సీ నోట్లు కాగితం ఆధారిత ప్రత్యేక పదార్థంతో తయారవుతాయి. వీటి మన్నిక కాలం తక్కువ. త్వరగా చిరిగిపోయే, పాడయ్యే ప్రమాదం ఉంటుంది. అయితే పాలిమర్ నోట్లు ప్రత్యేక ప్లాస్టిక్ తరహా పదార్థంతో తయారు చేస్తారు. ఇవి కాగితపు కరెన్సీతో పోలిస్తే చాలా ఎక్కువకాలం మన్నికగాఉండే అవకాశం ఉంటుంది. నీరు, తేమ లేదా సాధారణ వినియోగం వల్ల ఎక్కువ రోజులు గడిచినా ఇది పాడవకుండా ఉంటుంది. కొన్ని దేశాల్లో ఈ ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు 30 యేళ్లకుపైగా కొనసాగాయని గతంలో ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఈ పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నికగా ఉంటే వీటిని తరచుగా ముద్రించే అవకాశం తగ్గుతుంది. అలానే దాని ఖర్చులు కూడా తగ్గుతాయని ఆర్బీఐ భావిస్తోంది. ప్రయోగాత్మక పరీక్షల కోసం మొత్తంగా 200కోట్ల పాలిమర్ నోట్లను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఇందులో రూ. 10 విలువ కలిగిన ప్లాస్టిక్ నోట్లు 100 కోట్లు, రూ. 20 విలువ కలిగిన నోట్లు 100కోట్లు ముద్రించాలని భావిస్తున్నారు. ఈ నోట్లను ప్రయోగాత్మకంగా విడుదల చేసి వాస్తవ వినియోగంలో పరీక్షించి వాటి మన్నిక, ప్రజలు ఉపయోగించేవిధానం, నిర్వహణసౌలభ్యం, బ్యాంకింగ్ వ్యవస్థకు అనుకూలత వంటి అంశాల్ని పరిశీలించనున్నారు. అయితే ఇటీవల రూ.1000 విలువైన పాలిమర్ నోట్లు విడుదల అయ్యాయని సోషల్‌మీడియాలో ప్రచారంజరిగింది. రూ. 1000 విలువైన ప్లాస్టిక్‌నోట్లు ఏంరాలేదని క్లారిటీ వచ్చింది. ప్రస్తుత పాలిమర్ నోట్ల ప్రయోగం రూ.10, రూ.20 వరకే పరిమితం అని పేర్కొంది.

పెట్రో డీజిల్‌పై విండ్‌ఫాల్ ట్యాక్స్ రద్దు



న్యూఢిల్లీ, అక్టోబరు 31: పెట్రోల్ ఎగుమతులపై స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీని రద్దు చేసినట్లు ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించింది. పెట్రోల్ ఎగుమతులపై విండ్‌ఫాల్ టాక్స్ రద్దు చేసినా, మరోవైపు డీజిల్, ఎటిఎఫ్ ఎగుమతులపై మాత్రం ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. ఇక్కడ డీజిల్ ఎగుమతులపై ఎగుమతి సుంకాన్ని లీటరుపై రూ. 3 చొప్పున పెంచగా, విమాన ఇంధనంపై 50 పైసల చొప్పున పెంచినట్లు తెలిసింది. దేశీయంగా ఉత్పత్తి చేసి విదేశాలకు ఎగుమతి చేసే డీజిల్ ఎగుమతులపై గతంలో విండ్‌ఫాల్ టాక్స్ లీటరుపై రూ. 8.50గా ఉండగా ఇప్పుడు ఇది రూ. 3 మేర పెరిగి రూ. 11.50 కి చేరింది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్‌పై విండ్‌ఫాల్ టాక్స్ 50 పైసలు పెరిగి లీటరుకు రూ. 11 కు పెరిగింది. సవరించిన ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు సమాచారం. అంతర్జాతీయంగా చమురు ధరలకు అనుగుణంగా దేశీయంగా కేంద్రం పెట్రోల్, డీజిల్, ఎటిఎఫ్‌పై ఈ విండ్‌ఫాల్ టాక్స్‌ను సవరిస్తూ వస్తోంది. ప్రస్తుతం ముడి చమురు ధరలు గరిష్ఠ స్థాయిల్లోనే ఉన్నప్పటికీ పెట్రోల్‌పై సుంకాల్ని కేంద్రం తగ్గించడం గమనార్హం. ఇక్కడ అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఇక్కడి చమురు సంస్థలు దేశీయంగా చమురు నుంచి పెట్రోల్, డీజిల్, ఎటిఎఫ్‌ను ఉత్పత్తి చేసి విదేశాలకు ఎగుమతి చేస్తూ లాభాల్ని సొమ్ముచేసుకుంటున్నాయి. దేశీయ అవసరాలకే ఎక్కువ వినియోగించేలా, వాటి లాభాలకు అడ్డుకట్ట వేసేందుకు తొలిసారిగా 2022 జులైలో రష్యా ఉక్రెయిన్ కేంద్రం యుద్ధం సమ యంలో ఈ విండ్‌ఫాల్ టాక్స్ విధానం తీసుకొచ్చింది.

ఇక తర్వాత క్రమంగా క్రూడాయిల్ ధరలు తగ్గగా 2024లో ఆ విధానాన్ని కేంద్రం రద్దు చేసింది. ఇటీవల ఈ యేడాదిలో ఇరాన్ అమెరికా యుద్ధం నేపథ్యంలో మళ్లీ క్రూడాయిల్ ధరలు భారీగా పెరగడంతో మార్చిలో మళ్లీ ఈ విధానాన్ని తెచ్చింది. అప్పటి నుంచి ప్రతి 15 రోజులకు ఓసారి ఈ విండ్‌ఫాల్ టాక్స్ రేట్లను సవరిస్తూ వస్తోంది. ఇది ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, వోఎన్‌జిసి, ఆయిల్ ఇండియా వంటి సంస్థలపై ప్రభావం చూపించింది. ప్రస్తుతం దేశీయంగా ఇంధన ధరలు స్థిరంగానే ఉన్నాయి. హైదరాబాద్ మార్కెట్లో పెట్రోల్ ధర లీటరుకు రూ. 115.69 గా ఉండగా, డీజిల్ రూ. 103.82 వద్ద ఉంది.

సావరిన్ గోల్డ్‌బాండ్స్ ముందస్తు రిడింప్షన్‌కు ఛాన్స్



న్యూఢిల్లీ, అక్టోబరు 31: సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ సిరీస్ ఏడుకు సంబంధించి రిడెంప్షన్ ధరలను ఆర్బీఐ ప్రకటించింది. కేంద్రం 2021-22 సిరీస్ 7కు సంబంధించి 2021, నవంబర్ 2న జారీ చేయగా ఇప్పుడు ఐదేళ్ల పూర్తి చేసుకుంది. ఈ క్రమంలోనే ప్రీమెచ్యూర్ రిడెంప్షన్‌కు అవకాశం ఇచ్చింది. నవంబర్ 2 నుంచి ముందస్తుగా రిడీమ్ చేసుకునే అవకాశం ఇస్తోంది. తాజాగా ముందస్తు విమోచన ధరల్ని ప్రకటించింది. గతంలో గోల్డ్ బాండ్లను ఐదేళ్ల కిందట ఇష్యూ చేసినప్పుడు గ్రాము లేదా యూనిట్ గోల్డ్ బాండ్ ధర రూ. 4765గా ఉంది. ఆన్‌లైన్‌లో కొనుగోలుచేసి డిజిటల్ పేమెంట్ చేస్తే గ్రాముపైనే రూ. 50 చొప్పున డిస్కౌంట్ వచ్చింది. ఇక్కడగ్రాముధర రూ.4715గా అయింది. ఇక ఇప్పుడు గోల్డ్ బాండ్ ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ ప్రైస్‌ను గ్రాముకు రూ.14,167 గా నిర్ణయించింది. ఇక్కడ అక్టోబరు 28, 29, 30 తేదీల బంగారం ధర సగటు ఆధారంగా ప్రకటించింది. ఈ క్రమంలోనే గ్రాముపై రూ. 14167 రూ. 9452 లాభం వచ్చింది. ఇది శాతం పరంగా చూస్తే 200 శాతం కంటే ఎక్కువ. అంటే ఐదేళ్ల కిందట రూ. 1లక్ష ఇన్వెస్ట్ చేసిన వారికి రూ. 3 లక్షలకుపైగా రాబడివచ్చింది. ఇంకా ఇందులో వడ్డీని పరిగణనలోకి తీసుకోలేదు. కేంద్రం దీనిపై యేటా 2.50 శాతం చొప్పున వడ్డీ వస్తుంది. ఈ లెక్కన ప్రతి యేడాదికి రూ. 1లక్షపై రూ. 2500 వడ్డీ వస్తుంది. ఇలావదేళ్లకు రూ.12500 వడ్డీరూపంలో అందింది. దీంతో మొత్తంగా రూ.1లక్ష పెట్టుబడి రూ. 3,12,500గా మారింది. భౌతిక బంగారం కొనుగోళ్లను తగ్గించాలన్న ఉద్దేశంతోనే కేంద్రం ఈ కొత్త స్కీమ్ లాంఛ్‌చేసింది.

బంగారం ధరపెరిగిన దానికి అనుగుణంగా రిటర్న్స్ వస్తాయి. ఇటీవల కేంద్రఖజానాపై భారం పడుతుందన్న నేపథ్యంలో ఈ స్కీమ్‌ను కేంద్రం తాత్కాలికంగా నిలిపివేసింది. అయితే ఈ స్కీమ్ కాలపరిమితి 8యేళ్లుగా ఉన్నందున గతంలో గోల్డ్‌బాండ్లు కొనుగోలు చేసిన వారికి కేంద్రం ఇప్పటికీ డబ్బులు అందిస్తుంది. ఇండియన్ బులియన్ జువెల్లర్స్ అసిసోయేషన్ ధరల ఆధారంగా ఇష్యూ ప్రైస్, రిడెంప్షన్ ప్రైస్‌ను నిర్ణయిస్తుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.